సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

APTEL 14598/2015.

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి | ఆదివారం 7 ఫిబ్రవరి, 2016 సంపుటి : 1 సంచిక 19 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## తెలుగు ఏది ?



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోడీ

అమ్మ అన్న మాట ఎంత కమ్మనైనదో ఆ పదం ఉన్న తెలుగు భాష కూడా అంతే ఉన్నతమైంది.

తీయని తేనెలూరు తెలుగు జీవితాలకే వెలుగు..తెలుగు భాష ఎంత అందమైందో అంత గాంభీర్యమైనది.

అంత ఆత్మీయమైంది... అంత లోతైనది..

అంత సరళమైనది.. అంత సౌందర్యమున్నది..

అంత హృద్యమైనది.. అంత అద్భుతమైనది..

అందుకే కవిసార్వభౌముడైన శ్రీకృష్ణ దేవరాయలు 'దేశ భాష లందు తెలుగు లెస్స' అని తెలుగుపై తన మమకారాన్ని చాటుకున్నాడు. అటువంటి తెలుగు నేడు ఎవరికీ కాని భాష అవుతోంది. కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్రభాషలు మినహా ఇతర భాషలను అంగీకరించని పరిస్థితి ఉంటే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం భాషా పరిరక్షణ చర్యలు శూన్యమవుతున్నాయి. పాలకులు కోట్ల రూపాయలు వెచ్చించి చేపడుతున్న పథకాల్లో..

శిలాఫలకాల్లో తెలుగు మచ్చుకైనా కనిపించని పరిస్థితి. 2 లో

## కాపు మహోద్యమానికి శ్రీకారం

- బీసీ రిజర్వేషన్ కోసం 31న తునిలో కాపుల బహిరంగ సభ
- ముద్రగడ నాయకత్వంలో ఆఖరి పోరాటం



**రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తున్న తూర్పు గోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గం కిర్లంపూడి గ్రామంలో మరో ఉద్యమం పురుడు పోసుకుంది. గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, ముద్రగడ పద్మనాభం కాపుల్లోని బీద, బలహీన, అట్టడుగువర్గాల సంక్షేమం కోసం వారిని బీసీల్లో చేర్చాలని మరోసారి నడుం బిగ్గించారు. తన సుదీర్ఘ రాజకీయ, సామాజిక ఉద్యమాల కాలగమనంలో ఈ ఉద్యమాన్ని తన అంతిమ పోరాటమని ఆయనే స్వయంగా ప్రకటించారు.**

కత్తిపూడి, రాజధాని ప్రతినిధి :

హామీ మరచిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గాన్ని బీసీ సామాజిక వర్గాల జాబితాలో చేర్చి, వారికి రిజర్వేషన్లు వర్తింపచేస్తామని ప్రకటించింది. అత్యధిక మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్న తెలుగుదేశం ఆ హామీని మరిచింది. దీనినే ఆయుధంగా మార్చుకుని ముద్రగడ కాపు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఎన్నికల హామీని నెరవేర్చాలని ముద్రగడ పలుమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు లేఖలు కూడా రాశారు. అయితే వాటికి ఆయన నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో విశాల ప్రజా బాహుళ్యంలో, బహిరంగంగానే తేల్చుకోవాలని ముద్రగడ అమీతుమీకి సిద్ధమయ్యారు. దీంతో పాటూ రాష్ట్రంలోని పలువురు విద్యావంతులు, మేధావులు, కాపు సామాజిక వర్గానికి చెందిన వివిధ స్థాయిల నేతలతో సంప్రదింపులు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లోను, ముఖ్య పట్టణాల్లో, బహిరంగ సభల ద్వారా ప్రజల మద్దతును కూడగట్టుకోవాలని నిర్ణయించారు. ఆయన తన స్వగృహంలో ప్రకటించినట్లుగానే తునిలో జనవరి 31వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి సభను నిర్వహించ తలపెట్టారు. మేధావులు, నేతలు, రాజకీయ ఉద్దండులు, కాపు సామాజిక వర్గ ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు, సామాన్య ప్రజానీకానికి అవగాహన కల్పించేందుకు ఈ సభ వేదిక కానున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలను తునికి తరలిరావలిందిగా ఆహ్వానించారు.

### ఉద్యమానికి దన్నుగా కాపులు

ఈ ఉద్యమానికి ముద్రగడ ఒక వెన్నెముక అయితే, దానికి దన్నుగా కాపు ప్రజలే నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఉద్యమానికి మంచి స్పందన ఉంది. జిల్లా ముఖ్య నేతలు స్వచ్ఛందంగా ముద్రగడ కార్యకర్తలు, ఉద్యమ సాఫల్యంతో కృషి చేస్తూ వేదిక ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో కాపు సామాజిక వర్గంలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ఉద్యమ ప్లెక్సీలు వెలిశాయి. కరపత్రాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాయి. ఉద్యమానికి చేయి చేయి కలిపినట్లే, ఆర్థిక వనరులను కూడా కార్యకర్తలే సమకూర్చుకొని వాటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుని సభ విజయవంతం అవుతుందని సామాజిక వర్గ నేతలు భావిస్తున్నారు.

10వ తరగతి విద్యార్థులకు

## చంద్రన్న స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ కాంతిలాల్ దండే, షేక్ జానీమూన్

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు చంద్రన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందచేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం 10వ తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను విడుదల చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానీమూన్ మట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 33 వేల మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారని తెలిపారు. వీరిలో 24 వేల మంది తెలుగు మీడియం, 9 వేల మంది ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్, 40 రోజుల పాటు ప్రతి రోజూ పౌష్టికాహారం అందించేందుకు రూ.59 లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులను ఖర్చు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గత ఏడాది 10వ తరగతి ఫలితాలలో గుంటూరు జిల్లా 4వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ ఏడాది జరిగే పరీక్షలలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా విద్యార్థులు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండె మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ 10వ తరగతి విద్యార్థులకు మంచి ఉపయోగమన్నారు. విద్యార్థుల స్టడీ మెటీరియల్‌లోని అంశాలను అర్థం చేసుకుని 2016 మార్చిలో జరిగే 10వ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ బి. సుబ్బారావు, విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. పార్వతి, జిల్లా విద్యాశాఖాధికారి కె.వి. శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ ముఖ్యమంత్రిగా చంద్రబాబు



ఆదర్శముఖ్యమంత్రి అవార్డును అందుకుంటున్న చంద్రబాబు

**పూణే, రాజధాని ప్రతినిధి :** ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ అందించే ఆదర్శ ముఖ్యమంత్రి అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. పూణేలో శనివారం జరిగిన 6వ ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని ప్రధానంచేశారు. ఈసందర్భంగా చంద్ర బాబు నాయుడు మాట్లాడుతూ ఈ అవార్డు లభించటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి నటుడు బీజేపీ ఎంపి శత్రుఘ్నసిన్హా తదితరులు హాజరయ్యారు.

## డీఆర్‌డీఏ సోషల్ డైరెక్టర్ డేవిడ్ రాజీనామా ?

**రాజధాని ప్రతినిధి, తుళ్ళూరు :** సీఆర్‌డీఏలో సంవత్సర కాలంగా పనిచేస్తున్న సోషల్ డైరెక్టర్ ఎస్ఎస్ డేవిడ్ ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సీఆర్‌డిఏ కమిషనర్ శ్రీకాంత్‌ను విజయవాడలో కలిసి ఆయన రాజీనామా లేఖను అందించారు. నవ్యాంధ్ర అమరావతి రాజధానిలో ముఖ్య భాగమైన సీఆర్‌డీఏలో తొమ్మిది విభాగాలకు సంబంధించిన బాధ్యతలను నిర్వహిస్తున్న రాజీనామా విషయం సంచలనం కలిగించింది. సీఆర్‌డిఏ పరిధిలోని గ్రామాల విద్యార్థులకు శిక్షణ ఏర్పాటు చేసి, వారికి ఉపాధి చూపడానికి ఆయన ఎంతగానో కృషి చేస్తున్నారు. అయితే ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రైవేటు కంపెనీల నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. దీనిపై విద్యార్థులు సీఆర్‌డిఏ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నారు. గుంటూరు-కృష్ణా జిల్లాలకు చెందిన స్పిన్నింగ్ మిల్లుల అధినేతలు ఇటీవల తుళ్ళూరులో సమావేశం నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయారు. దీంతో మనస్థాపానికి గురైన డేవిడ్ తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలియవచ్చింది.

## ఈవారం రాజధాని

- ఏప్రిల్ నుంచి రైతులకు స్థలాలు ? సీఆర్‌డిఏ
- ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ యువకులు తుళ్ళూరు సీఆర్‌డిఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చెవిలో పువ్వు పెట్టుకుని వినూత్నంగా నిరుద్యోగులు నిరసన తెలిపారు
- రాజధాని పరిధిలోని తాడేపల్లి మండలం ఉండవల్లిలో రహదారులు ఏర్పాటు చేసి ఇళ్ళను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు
- ఏపీసీఆర్‌డీఏ సోషల్ డెవలప్‌మెంట్ సంస్థ గుంటూరు పరిసర ప్రాంతాల్లోని స్పిన్నింగ్ మిల్లుల్లో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంది.
- ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.
- దేశవ్యాప్తంగా బాపుకు ఘనంగా నివాళి
- రచయిత్రి నాయని కృష్ణకుమారి కన్నుమూత
- ఐసిస్ అంతు చూడనిదే వదిలిపెట్టం : ఒబామా
- సెలవుపై వెళ్ళిన సెంట్రల్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ శ్రీవాస్తవ
- సానియా, మిథాలీలకు సిఎం కేసిఆర్ ప్రశంస
- అమరావతి గ్రామాలలో మంత్రుల పర్యటన
- చరిత్ర సృష్టించిన మహిళా క్రికెటర్లు
- మాజీ క్రికెటర్ సుధీర్ కన్నుమూత
- ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలిచిన సానియా జోడీ
- జులై 2 నుంచి అమర్‌నాథ్ యాత్ర
- సింగరేణిలో మరో 400 పోస్టులు విడుదల
- రష్యాలో భూకంపం
- ఇకపై ఒకరికి నెలకు ఐఆర్‌సిటిసి ద్వారా ఆరు ట్రైన్ టిక్కెట్లు మాత్రమే

## ఎత్తిపోతల పథకాలు మనుగడ సాగించేనా?



**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** తుళ్ళూరు మండలంలోని రాయపూడి, తుళ్ళూరు, అనంతవరం గ్రామాలలో ఉన్న ఎత్తిపోతల పథకాలు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ మూడు పథకాల ద్వారా తుళ్ళూరు మండలంలోని పరిసర గ్రామాలైన తుళ్ళూరు, అనంతవరం,నేలపాడు, దొండపాడు, అబ్బరాజు పాలెం, రాయపూడి గ్రామాలలో ఉన్న 20 వేల ఎకరాలకు ఇప్పటి వరకు సాగు నీరు అందిస్తూ సేవలు అందిస్తున్నది. ఇప్పుడు రాజధాని భూ సమీకరణలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులు సాగు చేయకపోవడంతో ఈ భూములు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ భూములలో పొగాకు, మిరప, పత్తి, నిమ్మ, మొక్కజొన్న, కూరగాయలు పుష్కలంగా పండాయి. ఇప్పుడు సాగు చేయకపోవడంతో ఈ భూములకు సాగునీరు అవసరం లేకుండా పోయింది. ఈ మూడు ఎత్తి పోతల పథకాలలో ఉన్న మోటార్లు, ఫిల్టర్ మిషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పనిలేక తుప్పు పడుతున్నాయి. వీటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రభుత్వం దగ్గర సరైన ప్రణాళిక లేకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇక్కడ ఇప్పటి వరకు వ్యవసాయం చేస్తున్న రైతు కూలీలు, వ్యవసాయ పనులు లేక అమరావతి, తాడికొండ మండలాలలోని గ్రామాలకు వలస వెళుతున్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.50 కోట్ల ప్రజాధనాన్ని వినియోగించింది. అన్ని పంటలు పండిన ఈ భూములు వ్యవసాయం లేక రోదిస్తున్నాయి. వీటికంటే ముందుగా అమరావతి మండలమైన వైకుంఠపురంలో ఏర్పాటు చేసిన మిని ఎత్తిపోతల పథకం పనితీరు అంతంత మాత్రంగానే ఉంది. నిరుపయోగంగా ఉన్న ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## సమస్యలపై స్పందించండి!

**మీరు రాజధాని ప్రాంత వాసులా?**

**కొత్త రాజధాని 'అమరావతి'లో అనేక సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయా? వాటికి తగిన పరిష్కారం మీకు లభించడం లేదా? అయితే మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారాన్ని అందించడానికి సిద్ధమైంది**

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక రాజధాని వార్తలు

**దీనికి మీరు చేయవలసింది**

**మీరు ఎదుర్కొంటున్న సమస్యను సంక్షిప్తంగా ఒక కాగితంపై రాయండి దానికి ఎలాంటి పరిష్కారం కోరుకుంటున్నారో వివరించండి, దానిని మాకు అందించండి పత్రికలో ప్రచురిస్తాం.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం! మీ ఫొటో, చిరునామా, సెల్ నెంబరు ఇవ్వండి ..మర్చిపోకండి సుమా! వెంటనే స్పందించండి : వివరాలకు**

**రాజధాని వార్తలు**
**6-45/1, రాయపూడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ : 522237**
**ఫోన్ నెం. 9440662699**
rv@rajadhanivartalu.com

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక
రాజధాని వార్తలు

# కలం

## ఉద్యోగాలేవి.. బాబూ..!

జాబు రావాలంటే బాబురావాలని, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి ఇస్తామని ఊదరగొట్టిన తెలగుదేశం, రాజ్యాధికారం చేపట్టగానే చెప్పిన దానికి ఖచ్చితంగా వ్యతిరేకంగా చేస్తుందని ప్రతిసంఘటనా రుజువు చేస్తుంది. రాష్ట్రంలో లక్షా నలభైవేల ఉద్యోగాలు ఖాళీలున్నాయి. అయినా ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ చేసే ఆలోచనలో లేదు. తెలంగాణ ప్రభుత్వం పోలీసు ఉద్యోగాల నియామకాలకు, డీఎస్సీ కోసం ఉత్తర్యులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని యువకులు చాలా కాలం నుంచి డీఎస్సీకి, కానిస్టేబుల్, లేదా ఎస్ఐ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటూనే ఉన్నారు ...వీరిపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు...చంద్రబాబు నాయుడు ఉదాసీనతతో యువత నిర్వీర్యానికి లోనవుతున్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించాలని కోరుకుంటున్నారు. ఇంతే కాకుండా అంగన్‌వాడీలకు జీతాలు పెంచామని అది త్వరలో అమలు చేస్తామని ఊరించారు. నిత్యావసర సరుకులు ధరలు పెరిగి చాలీ చాలని జీతాలతో ఆర్థాకలితో ఉన్న అంగన్‌వాడీలు ఉద్యమిస్తే ఆందోళనలో పాల్గొన్నవారు ఆడవారని కూడా చూడకుండా ఈడ్చుకెళ్లి పోలీసువ్యానుల్లో పడవేయటమే కాకుండా ఖాకీల క్రౌర్యాన్ని రుచి చూపిస్తూ అంగన్‌వాడీలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది. ఆతరువాత వైద్యమిత్ర వంతయ్యింది. గ్రామాల్లో మహిళలు, పసిబిడ్డల ఆరోగ్యానికి ఎంతో కృషి చేస్తున్న వీరిని ప్రభుత్వం ఎలాంటి వర్తమానం లేకుండా ఉన్నపళాన ఉద్యోగాల నుంచి తొలగించింది. ఇలా చేయడం వల్ల కుటుంబాలు వీధిని పడతాయన్న కనీస అవగాహన కనపరచకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శం. మొన్నమొన్నవరకు వీఆర్‌ఓల పరిస్థితికూడా అంతే .. అంబులెన్స్ 108 వాహన ఉద్యోగులు కూడా ఇదే పరిస్థితిని చవిచూశారు. అంతెందుకు ప్రపంచస్థాయిలో రాజధానిని నిర్మిస్తామంటూ స్థానికులకు ఇక్కడే ఉద్యోగాలిస్తామంటే బీఈ, బీటెక్ చదివిన వారంతా ఉన్న ఉద్యోగాలు వదలి ఇక్కడి కొచ్చి సీఆర్‌డీఏ (రాజధాని ప్రాధికార సంస్థ) శిక్షణా విభాగంలో చేరారు. అయితే వారిని కూడా ప్రస్తుతం పట్టించుకోక పోవడంతో ఎంతో ఆగ్రహానికి గురౌతున్నారు.

అధికారం చేపట్టేవరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరిస్తామన్న తెలుగుదేశం దానికి వ్యతిరేకంగా ఉద్యోగుల పట్ల కాఠిన్యాన్ని కనబరుస్తోంది. ఉద్యోగాలు పోవడంతో కూలీనాలీ చేసుకుందామనుకుంటే భూములన్నీ ప్రభుత్వం పరిశ్రమల కోసం సేకరిస్తోంది. పరిశ్రమలో కార్మికులుగా ఉందామనుకుంటే అవి పెట్టాల్సిన వారికోసం చంద్రబాబునాయుడు దేశదేశాలన్నీ తిరుగుతున్నారు. ఎప్పుడో రూపొందే కలల సౌధాలకు ప్రస్తుత తరం బలికావాల్సిందేనా ... ఆదినుంచి చంద్రబాబంటే ఉద్యోగ వ్యతిరేకని ఒక ముద్ర ఉంది. ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన విషయాల మీదకూడా ఉద్యోగులను బాధ్యులుగా చేసి బలితీసుకుంటారని ఉద్యోగాలుకు భయం ఉండేది. దానికోసమే ఆయన తొమ్మిదేళ్లు పదవికి దూరంగా ఉండాల్సి వచ్చింది. నేను మారానంటే నమ్మరే అని పదే పదే విన్నవించుకుంటే మళ్లీ ఉద్యోగులు ఓట్లు వేసి గెలిపించారు. కాని మళ్లీ చంద్రబాబు మొదటికే వచ్చారనిపిస్తోంది. రాగానే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. డీఎస్సీ ఫలితాలను ఇంవరకు ప్రకటించ లేదు. యువత భవిష్యత్ అంధకారంలో ఉందని గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలి. వీరంతా అపసవ్య మార్గంలో జాతివిద్రోహులుగా మారి శాంతిభద్రతల సమస్య తలెత్తనివ్వకుండా చేయాలంటే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వం తక్షణ కర్తవ్యం.

## గ్రామ కంతాలపై రైతు ప్రతినిధులతో నారాయణ సమావేశం

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** రాజధాని ప్రాంతంలో గ్రామ కంతాలు, రోడ్ల నిర్మాణం, కేపిటల్‌సిటీ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తదితర అంశాలకు సంబంధించి రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు రైతు ప్రతినిధులతో రెండు రోజుల క్రితం సమావేశం నిర్వహించారు. విజయవాడలోని సీఆర్‌డిఏ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోరైతు ప్రతినిధులు పలు అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్ళారు. అత్యధికంగా సమస్యలున్న రాజధాని ప్రాంత గ్రామాల రైతు ప్రతినిధులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ముఖ్యంగా రాజధాని ప్రాంత ప్రజలు, రైతులు ఏఏ విషయాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారనే అంశాలపై మంత్రులు రైతు ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధిగమించి భవిష్యత్‌లోఎలా ముందుకు వెళ్ళాలి అనే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీకాంత్, గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే, జేసీ చెరుకూరి శ్రీధర్, సిఆర్‌డిఏ అదనపు కమిషన్లు డాక్టర్ ఎ. మల్లికార్జున, వి.రామ మనోహర రావు, ప్రసన్న వెంకటేశ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గన్నారు.

## తెలుగు ఏది ??

(1వ పేజీ తరువాయి)

రాజధాని శంకుస్థాపన శిలా ఫలకాల్లో కనిపించని తెలుగు

తెలుగు జాతి గర్వంగా చెప్పుకునే రీతిలో ఏటా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మరి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించ తలపెట్టిన రాజధాని ప్రాంతానికి ప్రపంచం నలమూలల నుంచి ఎందరో ప్రముఖులను ఆహ్వానించి ఎంతో ప్రతిష్టాత్మకంగా వందలకోట్లతో శంకుస్థాపన చేశారు మన పాలకులు. అటువంటి అమరావతి శిలాఫలకంలో తెలుగు అక్షరమే లేకపోవడం ఎంత విడ్డూరం. ఒక రాష్ట్రంలో ప్రతి కొట్టుకూ ఆ రాష్ట్ర భాషలో బోర్డులు కనిపిస్తాయి. మరో రాష్ట్రంలో ప్రభుత్వ జీవోలు అన్నీ ఆ రాష్ట్ర భాషలోనే ప్రచురిస్తారు. మన రాష్ట్రంలో కూడా తెలుగును కాపాడుకోవాలన్న తలంపుతో తెలుగు భాషాభివృద్ధి సంఘం ఏర్పాటు చేసి తెలుగు భాషా దినోత్సవం కూడా జరుపుకుంటున్నాం. మన ప్రభుత్వ జీవోలను కూడా తెలుగులోనే ప్రచురించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలుగు వారి ఆత్మగౌరవ నినాదంతో దివంగత ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చారు. తెలుగు భాషాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నారు. తెలుగు కవులు, సాంఘిక సంస్కర్తల శిల్పాలను నాటి రాజధాని హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించారు. ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన నేటి ప్రభుత్వం తెలుగును మరచిపోవడం తెలుగు ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా పాలుకులు మేలుకొని జీవభాష అయిన తెలుగును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని భాషావేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తుర్లపాటీయం

ఆయన అనుకూల అంశాలను నేను వివరించాను. ఆయన కార్యదక్షుడైన, చురుకైన రాజకీయ వేత్త అని, రెండు ప్రాంతాలవారు ఆయనను "తమ వాడు"గా పరిగణిస్తారని పేర్కొన్నాను.

'అయితే, వెంగళరావుకు పార్టీ ఎమ్.ఎల్.ఎ.ల మద్దతు ఉన్నట్టు లేదు కదా! ఆయన సామాజిక వర్గానికి చెందిన శాసన సభ్యులను వ్రేళ్ళపై టెక్కపెట్టవచ్చునేమో!మరి, అలాంటప్పుడు ఆయనను కాంగ్రెసు పార్టీ ఎలా అంగీకసిత్తుంది?" అనిశ్రీ సరీన్ ప్రశ్నించారు. "మేడం గాంధీ కనుక, వెంగళరావ్ ముఖ్యమంత్రి అని క్రటిస్తే, కాంగ్రెస్ పార్టీ మొత్తం మళ్ళీ ఎదురు చెప్పదు" అని నేను సమాధానం చెప్పాను. శ్రీ సరీన్ చిరునవ్వుతో నన్ను సాదరంగా సాగనంపారు. శ్రీ సరీన్ నన్ను 7.5 నిముషాల సేపు ప్రశ్నించారు.

**వెంగళరావు ఆదుర్దా**

మరో విశేషాన్ని ఇక్కడ పేర్కొనవలసివుంది. శ్రీ సరీన్‌ను కలుసుకొనడానికి వెడుతూ మార్గం మధ్యలో శ్రీ పిడతల రంగారెడ్డి ఇంటిలోతేనీరు తీసుకోడానికి ఆగాము. శ్రీ రంగారెడ్డి నాకు అత్యంత సన్నిహితుడు. ఆయన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గాను, ఆర్థిక,సమాచార శాఖల మంత్రిగానూ పనిచేశారు.

మేము వెళ్ళేసరికే శ్రీ రంగారెడ్డి గృహంలోపల అంకు పూర్వం రద్దయిన పి.వి.నరసింహారావు మంత్రి వర్గంలోని సగం మందికి పైగా సభ్యులున్నారు. వారిలో మాజీ ఉప ముఖ్యమంత్రి భ్రీ బి.వి. సుబ్బారెడ్డి, మంత్రులు శ్రీ మూర్తిరాజు, శ్రీ జలగం వెంగళరావు ప్రభృతులు న్నారు. వారికి శ్రీ పిడతల రంగారెడ్డి నన్ను పరిచయం చేస్తూ "కాబోయే ముఖ్యమంత్రిని గురించి తుర్లపాటి రాసిన లేఖను మరింత వివరణ కోసం మేడం గాంధి గవర్నర్ సలహాదారు సరీన్‌కు పంపారట! సరీన్ ఆహ్వానంపై తర్లుపాటి రాజ్ భవన్‌కు వెడుతూ ఇక్కడికి వచ్చా"రని పేర్కొన్నారు.

వెంటనే ముఖ్యమంత్రిత్వం కోసం ప్రయత్నిస్తున్న శ్రీ జలంగం వెంగళరావు నన్ను పక్కకు పిలిచి "శ్రీ సరీన్ మీతో ఏమంటాడో నాకు వెంటనే తెలియచేయండి" అని అన్నారు. నేను అలాగేనన్నాను.

సరీన్‌తో సమావేశమైన మరునాడు శ్రీ వెంగళరావు నివాసానికి వెళ్ళి జరిగినదంతా చెప్పి "మీకు శాసన సభ్యుల మద్దతు లేదని వారు భావిస్తున్నారు. ఎమ్.ఎల్.ఎ.ల మద్దతును మీరు కూడగట్టుకుంటే, మీ అభ్యర్థిత్వానికి వాళ్ళు సుముఖంగానే ఉన్నట్టు కనిపిస్తున్నా"రని చెబుతూ, మేడం గాంధి మీ పేరు ప్రకటిస్తే, అంతా మిమ్మల్నే అంగీకరిస్తారని నేను సరీన్‌తో చెప్పాననగానే, శ్రీ జలగం సంతోషంతో నన్ను అభినందించారు!

హోం మంత్రిగా వున్నప్పుడు శ్రీ జలగం కార్యదక్షత గురించి తెలుసుకున్న ప్రధాని ఇందిరా గాంధి 1973 డిసెంబర్‌లో ఆయన పేరునే ప్రకటించారు. 1973 డిసెంబర్ 10న శ్రీ జలగం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నేను సరీన్‌తో నడిపిన రాయబారానికి నన్ను అభినందిస్తూ శ్రీ జలగం నాకు లేఖ రాశారు. అంతేకాక, ఈ విషయంలో నా పాత్రను అభినందిస్తూ శ్రీ సరీన్‌కూడా ఢిల్లీ వెళ్ళిన తరువాత నాకు లేఖ రాశారు. ఆ లేఖను నేను శ్రీ వెంగళరావుకు చూపించగా, ఆయన దాన్ని తన వద్దనే అట్టిపెట్టుకున్నారు. దక్షులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులలో ఒకరుగా శ్రీ వెంగళరావు పేరు తెచ్చుకున్నారు. ఆయన 1973 డిసెంబరు నుంచి 1978 మార్చి వరకు ముఖ్యమంత్రిత్వంలో ఉండి, రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. రాష్ట్ర చరిత్రలో తనకొక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్నారు.

**నెహ్రూగాంధి కుటుంబంతో నా అనుబంధం**

దురదృష్ట వశాత్తు శ్రీ రాజీవ్ గాంది 1991 మే 21వ తేదీ అర్ధరాత్రి తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో అనూహ్యంగా, ఘోరంగా హత్యకు గురైనారు. శ్రీలంకలోని తమిళులపై అక్కడి ప్రభుత్వం జరుపుతున్న హింసాకాండకు అవరోధంగా ఉంటుందన్న ఉద్దేశంతో "లిబరేషన్ టైగర్స్ తమిళ్ ఈలం" అధినేత వేలుపిళ్ళై ప్రభాకరన్ అభ్యర్థనపై ప్రధాని రాజీవ్ గాంధి అక్కడికి భారతీయ శాంతి పరిరక్షక దళాన్ని పంపారు. పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు, తరువాత కొన్ని కారణాల వల్ల భారతీయ శాంతి సైనికుల వునికి ప్రభాకరన్‌కు నచ్చలేదు. ఆయన రాజీవ్‌పై పగ పెంచుకున్నాడు. థాను అనే మానవ బాంబును రాజీవ్ హత్యకు వినియోగించాడు. 1991 మేలో ఎన్నికల ప్రచారానికి శ్రీ రాజీవ్ గాంధి విశాఖపట్నం నుంచి శ్రీ పెరంబుదూర్ రాగా, ఆ మానవ బాంబును రాజీవ్ హత్యకు వినియోగించారు. 1991 మేలో ఎన్నికల ప్రచారానికి శ్రీ రాజీవ్ గాంధి విశాఖ పట్నం నుంచి శ్రీ పెరంబదూర్ రాగా, ఆ మానవ బాంబు రాజీవ్ గాంధికి నమస్కరిస్తున్నట్లు వంగే సరికి నడుంకు కట్టుకున్న బాంబు పేలి, ఆయువ మహానాయకుని పొట్టనుపెట్టుకున్నది! భవిష్యద్భారత ఆశాజ్యోతి ఆరిపోయింది. రాజీవ్‌తో పాటు ఆయన ప్రధాన అంగరక్షకుడు, ఆయన సమీపంలో ఉన్న కాంగ్రెసు కార్యకర్తలు గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఛిన్నాభిన్నమై పోయారు. ఆ మనోహర సుందర శరీరం గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఖండ ఖండాలైనది.



ఆ నిశి రాత్రి ఈ భయంకర వార్త తెలియగానే నేను మ్రాన్పడిపోయాను! "ఆ షాక్‌కు నాకు గుండె నొప్పి వచ్చింది. రాజీవ్ గాంధీకి నేను సన్నిహితుడ్ని. ఆయన ఉపన్యాసాలను అనువదించాను. ఆయన రాసిన లేఖలు నా వద్ద దాదాపు 40 వరకు ఉన్నాయి. ముఖ్యంగా మృతి చెందడానికి నెల రోజుల ముందు ఆయన నాకు రాసిన లేఖలలో ఆఖరుదానిలో ఆయన తాను కలలు కంటున్న భవిష్యద్భారతాన్ని చిత్రించారు.

ఆ లేఖను నేను ప్రతికలకు విడుదల చేశాను. భారత దేశంలోని ప్రధాన ఇంగ్లీషు పత్రికలన్నీ రాజీవ్ గాంధీ లేఖను ప్రచురిస్తూ నెహ్రూ-గాంధి కుటుంబంతో నాకు అప్పటికి 40 సంవత్సరాల నుంచి సన్నిహిత సంబంధాలున్నవని, పండిట్ నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధి, శ్రీ రాజీవ్‌గాంధి రాసిన దాదాపు నూరు లేఖలు నావద్ద ఉన్నవని ఢిల్లీ పత్రికలు పేర్కొన్నాయి.

## దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్‌గా ఏబీ డివిలియర్స్

**కేప్‌టౌన్:** దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్‌గా స్టార్ ఆటగాడు ఏబీ డివిలియర్స్ నియమించబడ్డాడు. ఈ మేరకు ఏబీని టెస్టు కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు క్రికెట్ సౌతాఫ్రికా(సీఎస్‌ఏ) తాజాగా స్పష్టం చేసింది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన చివరి రెండు టెస్టులకు హాషీమ్ ఆమ్లా కెప్టెన్సీ నుంచి వైదొలగడం తో ఆ బాధ్యతను తాత్కాలికంగా డివిలియర్స్ కు అప్పగించిన సంగతి తెలిసిందే. కాగా, జాతీయ సెలక్టర్లు అభిప్రాయంతో ఏబీని టెస్టు కెప్టెన్‌గా నియమిస్తూ దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్డే సారథిగా ఉన్నా ఏబీని టెస్టు కెప్టెన్‌గా నియమించడంపై సీఎస్ఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హారూన్ లోర్గాట్ హర్షం వ్యక్తం చేశారు.

## ఇండియా -శ్రీలంక వేదిక మార్పు

న్యూఢిల్లీ : శ్రీలంక-టీమిండియాల మధ్య వచ్చేనెల 12 వ తేదీన జరగాల్సిన రెండో ట్వంటీ 20 మ్యాచ్ జరిగే వేదిక ఢిల్లీ నుంచి రాంచీకి మారింది. ఆ మ్యాచ్‌ను నిర్వహించడానికి తాము ప్రస్తుతం సిద్ధంగా లేనట్లు డీడీసీఏ(ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు తెలియజేయడంతో మ్యాచ్ వేదికలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ వేదికను ఢిల్లీ నుంచి రాంచీకి మారుస్తున్నట్లు బీసీసీఐ తాజాగా స్పష్టం చేసింది. శ్రీలంక-టీమిండియా మ్యాచ్ నిర్వహణలో భాగంగా ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్ కు పీఓసీ సర్టిఫికేట్ ను జారీ చేయడానికి రాష్ట్ర హైకోర్టు విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో వేదిక మార్పు అనివార్యమైంది.


## స్టంపింగ్‌ల్లో ధోనీ ప్రపంచరికార్డు

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో ట్వంటీలో టీమిండియా కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ లో మ్యాక్స్ వెల్, ఫాల్కనర్‌లను స్టంపింగ్ రూపంలో పెవిలియన్‌కు పంపిన ధోని.. అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అత్యధిక స్టంపింగ్స్(140) చేసిన వికెట్ కీపర్‌గా గుర్తింపు సాధించాడు. తద్వారా అంతకుముందు శ్రీలంక మాజీ వికెట్ కీపర్ కుమార సంగక్కర అంతర్జాతీయ కెరీర్ లో నెలకొల్పిన 139 స్టంపింగ్స్ రికార్డు చెరిగిపోయింది. తొలుత యువరాజ్ బౌలింగ్ లో మ్యాక్స్‌వెల్ క్రీజ్ ను వదిలి కొద్దిగా ముందుకు వెళ్లి బంతిని హిట్ చేయబోయి ధోనికి దొరికిపోగా, ఆ తరువాత ఫాల్కనర్‌ను తన ప్యాడ్లతో బంతిని వికెట్లపైకి తోసి ధోని సక్సెస్ అయ్యాడు. ధోని చేసిన ఆ రెండు స్టంపింగ్స్‌తోనే మ్యాచ్ ఆసీస్ చేతుల్లోంచి పూర్తిగా చేజారిపోయింది.

## కోహ్లి అభిమానికి పదేళ్ల జైలు

**లాహోర్ :** పాకిస్తాన్‌లో భారతజాతీయ జెండా ఎగరేసినందుకు ఉమర్ ద్రాజ్ అనే వ్యక్తికి పాక్‌కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. భారత క్రికెటర్ విరాట్ కోహ్లి వీరాభిమాని అయిన ఉమర్ జనవరి 26న భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన టీ-20 మ్యాచ్‌లో కోహ్లి 90 పరుగులు చేయటంతో భారత జాతీయ పతాకాన్ని ఎగరేశాడు. దీంతో పాక్ పోలీసులు ఉమర్‌పై కేసుపెట్టారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు గురువారం ఉమర్‌కు పదేళ్ల జైలుశిక్ష విధించింది. కోర్టుకు వస్తున్న సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ.. తాను విరాట్ కోహ్లిని.. భారత క్రికెట్ జట్టును అభిమానిస్తానని తెలిపాడు.

## కరకట్ట రహదారిని బాగు చేయండి



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఉద్దండరాయుని పాలెం నుంచి వైకుంఠపురం వరకు ఉన్న కృష్ణా కరకట్ట రహదారిని సరిచేసి రోడ్డు వేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. ఇదివరకు ఉన్న తారు రోడ్డును అభివృద్ధిలో భాగంగా ప్రొక్లెయన్లతో పగల గొట్టారు. తరువాత తారు నిర్మాణం చేపట్టకుండా వదిలివేశారు. ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకుని ఈ రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఇవీ మన రైల్వే జోన్లు

| రైల్వే జోన్ | ప్రధాన కార్యాలయం | ప్రారంభమైన సంవత్సరం | మార్గం (కి.మి). |
|---|---|---|---|
| మధ్య రైల్వే (సెంట్రల్ రైల్వే) | ముంబై (సి.ఎస్.టి.) | 1951 నవంబర్ 5 | 3905 |
| తూర్పురైల్వే (ఈస్టన్ రైల్వే) | కోల్‌కతా | 1952 ఏప్రిల్ 14 | 2414 |
| ఉత్తర రైల్వే (నార్తరన్ రైల్వే) | ఢిల్లీ | 1952 ఏప్రిల్ 14 | 6968 |
| పశ్చిమ రైల్వే (వెస్టన్ రైల్వే) | ముంబై (చర్చ్‌గేట్) | 1951 నవంబర్ 5 | 6182 |
| దక్షిణ రైల్వే (సౌత్ రైల్వే) | చెన్నై | 1951ఏప్రిల్ 14 | 5098ా |
| ఈశాన్యా రైల్వే(నార్త్ ఈస్టన్ రైల్వే) | గోరఖ్‌పూర్ | 19562 ఏప్రిల్ 14 | 3667 |
| ఆగ్నేయ రైల్వే(సౌత్ ఈస్టన్ రైల్వే) | కోల్‌కతా | 1955 ఆగస్టు 1 | 2631 |
| వాయువ్య రైల్వే (నార్త్ వెస్టన్ రైల్వే) | జైపూర్ | 2002 అక్టోబర్ 1 | 5459 |
| నైరుతి రైల్వే (సౌత్ వెస్టన్ రైల్వే) | హుబ్లీ(కర్ణాటక) | 2003 ఏప్రిల్ 1 | 3177 |
| తూర్పు మధ్యరైల్వే (ఈస్ట్ సంట్రల్ రైల్వే) | హాజీపూర్ (బీహార్) | 2002 అక్టోబర్ 1 | 3628 |
| ఉత్తర మధ్య రైల్వే (నార్త్ సంట్రల్ రైల్వే) | అలహాబాద్ | 2003 ఏప్రిల్ 1 | 3151 |
| పశ్చిమ మధ్య రైల్వే(వెస్ సెంట్రల్ రైల్వే) | జబల్‌పూర్(మధ్యప్రదేశ్) | 2003 ఏప్రిల్ 1 | 2965 |
| దక్షిణ మధ్య రైల్వే (సౌత్ సంట్రల్ రైల్వే) | సికింద్రాబాద్ | 1966 అక్టోబర్ 2 | 5803 |
| ఈశాన్య సరిహద్దు రైల్వే(నార్త్-ఈస్ట్-ఫ్రాంటైర్) | మాలిగావ్(గౌహతి) | 1958 జనవరి 15 | 3907 |
| ఆగ్నేయ మధ్య రైల్వే(సౌత్-ఈస్టన్ సెంట్రల్ రైల్వే) | బిలాస్‌పూర్ (ఛతిస్‌గఢ్) | 2003 ఏప్రిల్ 1 | 2447 |
| తూర్పుకోస్తా రైల్వే(ఈస్ట్‌కోస్టల్ రైల్వే) | భువనేశ్వర్ | 2003 ఏప్రిల్ 1 | 2677 |
| కోల్‌కతా మెట్రో రైల్వే | కోల్‌కతా | 2010 డిసెంబర్ 31 | 120 |

**మొట్టమొదటి రైల్వే మార్గాన్ని నిర్మించిన భాతీయులుగా జగాన్నాధ్ ఘంకెర్‌సేధ్, జెంషెడ్జీ జీజీభాయ్ గుర్తింపు పొందారు.**

# రాయపూడి పంజా సెంటర్‌లో పారిశుద్ధ్యం అధ్వానం





**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** స్థానిక రాయపూడి పంజా సెంటర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. నిత్యం గ్రామస్తులు తిరిగే ఈ ప్రాంతంలో.. ప్రధాన సెంటర్‌లోని కాలువలో మురుగు ఏరులై పారుతోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తూ పట్టపగలు కూడా సెంటర్‌లో కొద్దిసేపు నిలబడలేని పరిస్థితి నెలకొంది. దుర్గంధంతో స్థానికులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. కాలువ సమీపంలో దాదాపు 50పైగా ఇళ్లు ఉన్నాయి. ఆయా ఇళ్లలో నివసిస్తున్నవారు దుర్వాసన, దోమలు, ఈగలతో సతమతమవుతున్నారు. తరచూ రోగాల బారిన కూడా పడుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. తుళ్లూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు ఇక్కడకు చేరి నిల్వ ఉంటోంది. దీంతో కాలువ రోజు రోజుకూ అధ్వానంగా తయారవుతోంది. రాబోయే పుష్కరాలకు ఈ మార్గంలోనే భక్తులు రాయపూడి రేవుకు వెళ్లాల్సి ఉంది. వారికి ఈ కాలువ వల్ల కూడా అసౌకర్యం కలిగే పరిస్థితి నెలకొంది. రాజధానికి సంబంధించిన కీలక కార్యాలయాలు కూడా ఈ ప్రాంతానికి రానున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాల్సి ఉంది. గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంబడే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. వీటికి తోడు గ్రామంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు శివారుల్లో సైతం డ్రెయినేజీల పరిస్థితి కూడా అధ్వానంగానే ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కనీసం నెలకొకసారైనా పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించాలని వారు కోరతున్నారు.





# ఆసుపత్రులలో మెరుగైన సేవలకు చర్యలు

## - మంత్రి కామినేని



మీడియా మాట్లాడుతున్న కామినేని

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మోకీలు శస్త్ర చికిత్స అనంతరం బుధవారం ఆయన డిశ్చార్జి అవుతూ మీడియాతో మాట్లాడారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మోకీలు శస్త్ర చికిత్స విజయవంతమైందని, ఇందుకు కృషి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్లు నర్సులు, పారా మెడికల్ సిబ్బంది తదితరులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు. అందరూ అవిశ్రాంతంగా పనిచేశారని చెప్పారు. అలాగే గత అయిదు రోజులుగా పాజిటివ్ విధానంలో వ్యవహరించిన మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఫిజియోథెరపి, నడక ప్రధానమని చెప్పారు. అవి త్వరగా కోలుకోవడానికి దోహద పడుతాయని చెప్పారు. మూడు వారాల పాటు ఫిజియోథెరపి చేయించుకోవలసి ఉందన్నారు. శస్త్రచికిత్స అనంతరం జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు తన నుండి వివరాలు సేకరించుకుంటున్నట్లు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సమగ్రాభివృద్ధికి రూ.60 కోట్లు ఖర్చవుతుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తనను ఒక కుటుంబ సభ్యునిగా భావించి పనిచేశారన్నారు. ఒక సామాన్య మానవునిగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడం జీవితంలో ఒక మంచి పనిగా భావించానన్నారు. తన శస్త్ర చికిత్స అనంతరం డాక్టర్లలో ఒక ఆత్మ విశ్వాసం ఏర్పడిందని, ఆసుపత్రికి మంచి పేరు వచ్చిందన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సకు సంబంధించిన పరికరాలు, అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి గత బుధవారం ఉదయం శ్రీనివాస్ డిశ్చార్జి అయ్యారు. సమావేశంలో మంత్రితో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. టి. పద్మజా రాణి తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లోనే పాస్‌పోర్టు !





**న్యూఢిల్లీ :** పాస్ పోర్టు పొందాలంటే చాలా కష్టం. అందుకు ముందు దరఖాస్తు చేయాలి. తరువాత పోలీసు వెరిఫికేషన్ అవ్వాలి. ఆ తరువాత పాస్‌పోర్టు మంజూరు కావాలి. అది మనకు చేరాలి. ఇదంతా అవ్వాలంటే ఎంత లేదన్నా నెల నుంచి రెండునెలలు సమయం పడుతుంది. కాని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం పుణ్యమా అని వారం రోజుల్లోనే పాస్‌పోర్టు చేతికి వచ్చే అవకాశం కనిపిస్తుంది. కేవలం మూడు రకాల పత్రాలు దాఖలు చేస్తే చాలు. వారం రోజుల్లో పాస్‌పోర్టు వచ్చేస్తుందని చెబుతున్నారు. అది కూడా తత్కాల్ కాదు. సాధారణ పరిధిలోనే ఆదాయ కార్డు కాపీ, ఓటరు గుర్తింపు కార్డు కాపి, పాన్ కార్డు కాపి ఈ మూడింటితో పాటు పౌరసత్వం కుటుంబ వివరాలు, నేర రికార్డులు లేవన్న డిక్లరేషన్‌తో కూడిన అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. సాధారణంగా పాస్‌పోర్టుల జారీ ఆలస్యం కావడానికి ప్రధాన కారణం పోలీస్ వెరిఫికేషన్.

అయితే ఇలాంటి వాటికి మాత్రం పాస్‌పోర్టు జారీ అయిన తరువాత ఈ వెరిఫికేషన్ చేస్తారు. అందుకు అదనపు చార్జీ ఏమీ వసూలు చేయరు. ముందుగా ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తారు. దీనికి తోడు ఓటరు కార్డు, పాన్ కార్డును కూడా తనిఖీ చేస్తారు. ఒక వేళ పోలీసు తనిఖీలో నివేదిక భిన్నంగా వస్తే పాస్‌పోర్టు వెనక్కు తీసుకుంటారు.

భద్రతా విషయంలో ఏమాత్రం రాజీ పడకుండానే పాస్‌పోర్టు జారీ ప్రక్రియ సులభతరం చేయడానికి ఇలా చేసినట్లు విదేశీ వ్యవహారాల శాఖలో పాస్‌పోర్టు విభాగం డైరెక్టర్ అనిల్ కుమార్ సోబ్తి చెప్పారు. ఆధార్ డేటా బేస్ సిద్ధంగా ఉన్నందువల్ల దాని ఆధారంగా అప్పటికప్పుడే మొత్తం తనిఖీ చేసుకోవచ్చునని, అది కూడా దరఖాస్తు చేసే వారు పాస్ పోర్టు సేవా కేంద్రం దగ్గర ఉండగానే అయిపోతుందని ఆయన చెప్పారు. దరఖాస్తు దారులు వివరాలన్నిటిని ఖచ్చితంగా ఇస్తే ఆ తరువాత పోలీసు వెరిఫికేషన్‌లో నివేదిక భిన్నంగా ఉండే ప్రమాదం తప్పుతుందని అన్నారు.

# సచివాలయం ప్లాన్‌ను విడుదల చేసిన సీఆర్‌డీఏ

**రాజధాని ప్రతినిధి, తుళ్ళూరు :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలోని వెలగపూడి గ్రామంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన సచివాలయం ప్లాన్‌కు సంబంధించిన ఊహా చిత్రాలను సిఆర్‌డిఏ ఇటీవల విడుదల చేసింది. సచివాలయాన్ని మొత్తం 900 ఎకరాలలో నిర్మిస్తారు. ఇందుకు గాను రూ.2371 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో సదుపాయాలకు రూ.1700 కోట్లు, సచివాలయానికి రూ.318 కోట్లు, చదరపు అడుగుకు రూ.3500 చొప్పున సిఎం నివాసానికి రూ.12 కోట్లు, అమరావతి గెస్ట్ హౌస్‌కు రూ.16 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిని అంచనా వ్యయంగా మాత్రమే భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ నాటికి ప్లాన్ పూర్తి చేసి సెప్టెంబర్ నాటికి టెండర్లు ఖరారు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ నివాస సముదాయాల కల్పనకు సంబంధించి ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్లానింగ్ చేసి వచ్చే ఏడాది డిసెంబరు నాటికి టెండర్లు ఖరారు చేయాలని నిర్ణయించారు. కాగా ఆరు అంతస్తుల నమూనాతో కూడిన ఈ ప్లాన్‌లో క్యాబినెట్ హాలు, సిఎం కార్యాలయం, మంత్రులు, సెక్రటరియేట్, వారి కార్యదర్శుల కార్యాలయాలు తదితర అంశాలతో కూడిన పూర్తి సమాచారం ఈ ప్లాన్‌లో ఇమిడి ఉంది. ప్రధాన ద్వారం, భద్రతా విభాగాలు, లాంజ్ వంటి వాటిని ఇందులో సూచించారు.



# కృష్ణా పుష్కర పనులకు ప్రతిపాదనలు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ ఎ. బాబు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పుష్కరాల సన్నాహక ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు రూ.1600 కోట్ల వ్యయంతో సమగ్ర ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. పనులన్నింటినీ విభాగాల వారీగా స్పష్టంగా విభజించాలని సూచించారు. నిర్మాణ శాఖలైన రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ విద్యుత్ శాఖ పనులు పూర్తయ్యేందుకు సహకరించాల్సిన రెవెన్యూ తదితర శాఖలను అప్రమత్తం చేయాలన్నారు. గోదావరి పుష్కరాల్లో తాత్కాలికంగా ఉపయోగించి పక్కన బెట్టిన పరికరాలను కృష్ణా పుష్కరాలలో ఉపయోగించే అవకాశాలను పరిశీలించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కలెక్టరేట్‌లో పుష్కర కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు కూడా తమ పనులకు సంబంధించి పుష్కర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పుష్కర పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ దిగువ ఉన్న యాప్రాన్ పనులకు సంబంధించి టెండర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి 123 ఘాట్ల పనుల కోసం రూ.395 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని సంబంధిత అధికారి కలెక్టర్‌కు తెలిపారు. ఆయా శాఖల అధికారులు తాము ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జేసీ గంధం చంద్రుడు, సబ్ కలెక్టర్ సృజన ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే ఉత్సవాలు

**రాజధాని, విజయవాడ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణ కర్త బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తి, మేధా శక్తితో మన భారత దేశానికి అత్యంత కీలకమైన రాజ్యాంగం జనవరి 26 నుంచే అమలులోకి వచ్చిందని, దేశ వ్యాప్తంగా రిపబ్లిక్‌డేను ఘనంగా ప్రజలందరూ ఐకమత్యంతో నిర్వహించుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడుస్తూ దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బచ్చుల అర్జునుడు, అర్బన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, మేయర్ కోనేరు శ్రీధర్, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యలమంచలి గౌరంగబాబు, కో-ఆప్షన్ సభ్యురాలు చెన్నుపాటి ఉషారాణి, కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, కోసూరి శైలజ, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, నాయకులు లుక్కా సాయిరాం గౌడ్, బోయిన సుబ్రహ్మణ్యం, పోలుకొండ వెంకటేశ్వరరావు, కోసూరి మణి, వాకా వెంకటేశ్వరరావు యాదవ్, మసిముక్కు శ్రీనివాస్ యాదవ్, గుండపునేని ఉమావర ప్రసాద్, నందమూరి నాగేశ్వరరావు, దండూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# మహాత్మా గాంధీకి నివాళి

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** మహాత్మాగాంధి దివి నుండి భువికి దిగి వచ్చిన దైవ స్వరూపమని పేర్కొంటూ నర్సరావుపేటలోని మహాత్మ చారిటబుల్ ట్రస్ట్ ఆయనకు నివాళి అర్పించింది. గుంటూరు లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాలులో ఇటీవల గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ట్రస్టు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, గంటా శ్రీనివాసరావు, ఎం. వేణుగోపాలరెడ్డి, ఎంపీ రాయపాటి సాంబశివరావు, గల్లా జయదేవ్, విజ్ఞాన్ గ్రూప్ చైర్మన్ లావు రత్తయ్య, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, స్నేహ గ్రూప్ ఆర్గనైజేషన్స్ చైర్మన్ కె.శివ భాగ్యరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సభాపతి కోడెల శివప్రసాదరావు సభకు అధ్యక్షత వహించారు. మహాత్మాగాంధీ ట్రస్టు గాంధీకి సంబంధించి పలు కార్యక్రమాలను చేపడుతున్నదని ఈ సందర్భంగా నిర్వాహకుల తెలిపారు. ముఖ్యంగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్గొండ జిల్లాలోని చిట్యాల వద్ద మహాత్మాగాంధీ ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. అదేరోజు మహాత్మా గాంధీకి సంబంధించిన భక్తి గీతాల సీడీని కూడా ఆవిష్కరించినట్లు తెలిపారు.

# మత్స్యకారులకు వలల సరఫరాకు టెండర్లు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** ఆక్వా రంగ ప్రగతికోసం, ప్రయోజనం కోసం "రాష్ట్రీయ కృషి వికాస్ యోజన" పథకం ద్వారా మత్స్యకారులకు వలలు, బోట్లు (నది మరియు సముద్ర వేట చేయుట వారి కొరకు) 50 శాతం సబ్సిడీపై సరఫరా చేయుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీని నిమిత్తం ఆసక్తిగల వలల సరఫరాదారులు కనీస రేట్లతో ది.1-2-2016 తేదీ మధ్యాహ్నం 2.00 గంటల లోపుగా మత్స్యశాఖ ఉపసంచాలకుల కార్యాలయం గుంటూరులో సీల్డ్ కవర్‌లో సమర్పించాల్సిందిగా అధికారులు తెలిపారు. అదే తేదీ సాయంత్రం 4 గంటలకు జిల్లా కొనుగోలు కమిటీ సరఫరాదారుల సమక్షంలో సీల్డ్ కవర్లు తెరచి టెండర్లు ఖరారు చేస్తారు.





## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
**దాదా : 9441754056, రాయపూడి**
**వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.**
**ఎస్‌కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు**
**ఎస్. రామోహనరావు : 8801933160, మందడం.**

**దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్**
**& జిరాక్స్ తీయబడును**
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
**కౌసర్ : 9989035143, రాయపూడి.**

**ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్**
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
**షేక్ జానీ, సెల్ : 9948450791**

**వివాహ బంధం**
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
**షేఖ్ జానీ : 9985394613**
అయ్యప్పనగర్, విజయవాడ.

**REALESTATE**

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

నవ్యాధ్రరాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ రింగులో ల్యాండుపూలింగ్‌లో ఇచ్చిన జరీబు పొలం 40 సెంట్లు కలదు. సంప్రదించండి 9440662699
Google Co-ordinates
16.561657, 80.476594


**రేమండ్ టైలర్స్**
మెయిన్ బజారు, తుళ్ళూరు

**చంద్రిక ట్రేడర్స్**
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
**ఫోన్ : 9908073516**

**కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్**
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
**ఫోన్ : 97040748420**

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
**సెల్ నెం. 9848407935**

# ఆరోగ్యం



డాక్టర్ దీపక్ వర్మ
బి.హెచ్.ఎమ్.ఎస్.

## హైపర్ టెన్షన్ (బి.పి.) రక్త పోటు

రక్తపోటు అనే ఈ సమస్య మనిషి తన జీవితకాలంలో ప్రధాన దీర్ఘకాలిక సమస్యలలో ముఖ్యమైనది. రక్తపోటు అనేది వ్యాధి అయినప్పటికీ దీని వెనుక ఉన్న కారణాలు ఎన్నో, దుష్పరిణామాలు ఎన్నెన్నో.

అధిక రక్తపోటు : అంటే మన రక్త ప్రవాహము గుండె నుండి మరియు రక్త నాళాలు వైపు ప్రవహించే ఒత్తిడి ఎక్కువగా ఉండటం. దీనిని ప్రధానంగా మనం కొలిచేది

1.సిస్టోల్ 2.డయాస్టోల్ అనే రెండు కొలతల ద్వారా

సిస్టోల్ : అనగా మన గుండె సంకోచం చెందడం. ఈ సంకోచాన్ని పరిక్షించే పరామితి

డయాస్టోల్ : అనగ మన గుండె వ్యాకోచం చెందడం. ఈ వ్యాకోచాన్ని పరిక్షించే పరామితి.

ఈ రక్తపోటు అనేది మనిషికి మనిషికీ మధ్య చాలా మార్పు అనేది ఉంటుంది. ఇది ఆడ, మగ వారిలో వయసు పరంగా వేరు వేరుగా కనిపించవచ్చు. ముఖ్యంగా వృద్ధులలో సాధారణంగా రక్తపోటు, సాధారణ వయస్సు వారి కంటే ఎక్కువగా ఉంటుంది. ఇది పరిమితిలో ఉన్నంత వరకు ఎలాంటి ప్రమాదము కాదు.

అధిక రక్తపోటు రెండు రకాలు :

1. ప్రైమరి హైపర్‌టెన్షన్ : ఈ వ్యాధి ఉన్నవారిలో 95 శాతం మందికి ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా ఉంటుంది.

2.సెకండరీ హైపర్‌టెన్షన్ : ఈ వ్యాధి 5 శాతం మందిలో మాత్రమే కనిపిస్తుంది. ఈ పరిస్థితి ఒక ముఖ్యమైన కారణం వలనే సంభవిస్తుంది

హై బ్లడ్ ప్రెజర్ వాల్యూస్ :
సిస్టోల్ : 140 నుండి అంత కంటే ఎక్కువగా ఉండటం
డయాస్టోల్ : 90 నుండి 100 కంటే ఎక్కువగా ఉండటం

ప్రి హై బ్లడ్ ప్రెజర్ :
సిస్టోల్ : 130 నుంచి 140 వరకు అంతకంటే ఎక్కువగా
డయాస్టోల్ : 80 నుంచి 90 వరకు

నార్మల్ బ్లడ్ ప్రెజర్ :
సిస్టోల్ : 120–110 వరకు
డయాస్టోల్ : 80–70 వరకు

లో బ్లడ్ ప్రెజర్
సిస్టోల్ : 90 నుండి 70 వరకు
డయాస్టోల్ : 60 అంతకంటే ఎక్కువ

లక్షణాలు :
- గుండె వేగంగా కొట్టుకోవడం, మన గుండె చప్పుడు మనకే వినిపించడం
- గాబరాగా ఉండటం
- తలనొప్పులు ఎక్కువగా రావడం
- ఎక్కువగా రక్త ప్రసరణ వలన ముఖం ఎర్రగా కనిపించడం
- కళ్ళు లేదా తల తిరిగినట్టు ఉండటం
- అధిక రక్తపోటు ఉన్నవారికి కొన్ని సార్లు ముక్కు నుండి రక్తస్రావం అవ్వడం
- ఆయాసం ఎక్కువగా రావడం
- మెట్లు ఎక్కడం, పనిచేస్తుండగా ఊపిరి బరువుగా అనిపించడం
- త్వరగా చిరాకు, కోపం ఎక్కువగా రావడం మనిషి తన జీవితంలో ఎదురయ్యే పరిస్థితులకు ఉన్న దానికంటే ఎక్కువగా ఆలోచించడం, రియాక్ట్ అవ్వడం

పరీక్షలు : ఈసీజీ, సిఎక్స్‌ఆర్, యూరిన్ ఎనాలిసిస్, ప్లాస్మా యూరల్, క్రియెటైమైన్, ఫాస్టీ లిపిడ్స్

జాగ్రత్తలు :
- వైద్యుని పర్యవేక్షణ క్రమం తప్పక వహించడం
- తీసుకునే ఔషధాలు దీర్ఘకాలికంగా వాడేటప్పుడు వైద్యుని పర్యవేక్షణ అవసరం
- శారీరక వ్యాయామం పెంచుకోవడం
- మద్యపానం తగ్గించుకోవడం
- యోగ, మెడిటేషన్
- యాంటీ ఆక్సిడెంట్స్, ఒమెగా 3 ఫాటీ యాసిడ్స్ ఉన్న పదార్థాలు తీసుకోవడం
- వెల్లుల్లి ఎక్కువగా తినే వంటల్లో వాడుకోవడం

హోమియో చికిత్స : రోగి వ్యాధి లక్షణాలకు మాత్రమే కాకుండా రోగం రావడానికి, శరీరంలో ఈ తరుపు మార్పులు రావడం వెనకున్న బలమైన కారణాలు తొలగించడం అంటే రోగి మానసిక, శారీరక తత్వాలను దృష్టిలోకి తీసుకోవడం వల్ల వంశపారంపర్యమైన చరిత్ర ఉన్నప్పటికి దీనిని ఎలాంటి దుష్పరిణామాలు లేకుండా రోగికి ఆరోగ్యాన్ని ఇవ్వడమే ఈ హోమియోపతి వైద్యం.

# గుంటూరు జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు





గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ పతాకానికి వందనం చేస్తున్న గుంటూరు కలెక్టర్ కాంతిలాల్ దండే. గౌరవ వందన స్వీకరిస్తున్న కలెక్టర్

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** గుంటూరు జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీ కాంతీలాల్ దండే పిలుపు నిచ్చారు. 67వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ జాతీయ పతాకావిష్కరణ గావించి, పోలీసు, ఎన్‌సిసి దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా దండే ప్రసంగిస్తూ జిల్లాలో నూతన రాజధాని నిర్మాణానికి గత సంవత్సరం ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ నిర్వహించగా, ప్రపంచంలోనే పేరెన్నిక గల రాజధాని నిర్మాణానికి తుళ్ళూరు మండలం, ఉద్ధండరాయుని పాలెంలో ప్రధాని నరేంద్ర మోడి చేతల మీదుగా అక్టోబర్ 22వ తేదీన అమరావతికి శంకుస్థాపన జరగడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర రాష్ట్రానికి కేంద్రం ప్రకటించిన వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఎయిమ్స్ ఇన్‌స్టిట్యూట్‌కు గుంటూరు జిల్లాలో శంకుస్థాపనలు జరగడం, అలాగే అమరావతి పట్టణాన్ని హృదయ్ పథకం కింద ఎంపిక చేసి 51 కోట్ల రూపాయిలతో అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం జిల్లాకే గర్వ కారణమన్నారు.

రైతుల అవసరాలను తీర్చి, గిట్టుబాటు ధరను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామంలో సుగంధ ద్రవ్యాల పార్కు ప్రారంభించిందన్నారు. అనంతరం జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వివరిస్తూ రైతు రుణ మాఫీ పథకం ద్వారా జిల్లాలో 5 లక్షల 75 వేల మంది రైతులకు 912 కోట్ల రూపాయలు మాఫీ చేశామన్నారు. జిల్లాలో 2015–2016 ఆర్థిక సంవత్సరంలో 7,341 కోట్ల పంట రుణాలు పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 6,168 కోట్ల పంట రుణాలు వివిధ బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా 19 కోట్ల రూపాయల సబ్సిడీతో వివిధ యంత్ర పరికరాలు అందజే స్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛనుల కింద 3,68,139 మందికి నెలకు 36 కోట్ల 30 లక్షల 25 వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు**

వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, జిల్లా సహకార శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అగ్నిమాపక శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, రెవిన్యూ శాఖ, ఉద్యానవన శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణ సంస్థ, నగర పురపాలక శాఖ, విద్యా శాఖలు తమ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై నిర్వహించిన శకటాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. పౌర సరఫరాల శాఖ శకటానికి మొదటి బహుమతి, వ్యవసాయ శాఖ శకటానికి రెండవ బహుమతి, గృహ నిర్మాణ సంస్థ శకటానికి మూడవ బహుమతి లభించగా, సంబంధిత శాఖల అధికారులకు కలెక్టరు మెమొంటోలను అందచేశారు. గణ తంత్ర దినోత్సవ వేడుకల్లో శాసనమండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వ రరావు, తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, అర్బన్ మరియు రూరల్ ఎస్పిలు సర్వశ్రేష్ఠ త్రిపాఠి, నారాయ ణ నాయక్, సంయుక్త కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సంయుక్త కలెక్టర్–2 ఎం. వెంకటేశ్వరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి భాస్కర నాయుడు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# మానవత్వం పరిమళించిన వేళ

ఆమె

వైద్యో నారాయణో హరీ.. అన్నారు పెద్దలు. అంటే వైద్యుడు సాక్షాత్తూ కళ్లముందు కనిపించే దేవుడని అర్థం అయితే రోజులు మారాయి. కార్పొరేట్ వైద్యం పేరుతో దోపిడీ మొదలైంది. విపత్కర పరిస్థితుల్లో వెళ్లినా ఇది గుండెజబ్బు.. దీనికి కనీసం మూడు లక్షలు అవుతుంది. కీళ్ల ఆపరేషన్ దీనికి కృత్రిమ మోచిప్ప అమర్చాలి స్టీలుదైతే ఇంత, ఫైబర్ అయితే ఇంత, అని స్టీలు గిన్నెలు అమ్ముకునేవాడిలా డబ్బులు గురించే మాట్లాడుతూ, నాడీ పట్టుకోగానే కటువుగా పలికే డాక్టర్లు ఇప్పుడు చాలా మందే ఉన్నారు. ఒకవేళ యాక్సిడెంట్ అయ్యి ఎవరైనా రోడ్డుపై విలవిలలాడుతున్నా పట్టించుకునే వారే లేరు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి, పోలీసులు చేరేవరకు ఉండే సమయాన్ని కూడా ఎవరూ కేటాయించడం లేదు. అయితే ఇలాంటి వారి మధ్య కూడా సమాజానికి పనికివచ్చే మంచి డాక్టర్లు ఉన్నారని ఒక సంఘటన చాటి చెప్పింది. వివరాల్లోకి వెళితే ..

ఒక ఆదివారం రోజు ఎప్పటిలానే హౌస్‌సర్జన్‌గా విధులు ముగించుకొని ట్రెక్ అనంతగిరి నుంచి బస్సులో డాక్టర్లంతా ఇంటికి తిరిగి వస్తున్నారు. హోటల్ ద్వారక దగ్గర సిటీబస్సు దిగి అక్కడ నుంచి నడుచుకుంటూ వస్తుంటే ఎదురుగా జనం మూగి ఉన్నారు...ఎందుకా అని



మహిళా డాక్టర్లు పైజా అంజుమ్, సావిత్రిదేవి

చూస్తే ఇంకేముంది అక్కడ యాక్సిడెంట్ జరిగి ఒక యువ కుడు చావు బతుకుల మధ్య ఉన్నాడు. అది చూసిన ఇద్దరు మహిళా డాక్టర్లు పైజా అంజువఎతంతు, సావిత్రిదేవిలకు వారి కర్తవ్యం గుర్తుకు వచ్చింది. వీడియోలు తీస్తూ, చోద్యం చూస్తూ నిలుచున్నవారిని తోసుకుంటూ బాధితుడి దగ్గరికి వెళ్లి చెయ్యి పట్టుకొని నాడి చూశారు. అది బలహీనంగా కొట్టుకుంటోంది ....గాలి కూడా సరిగ్గా ఆడటం లేదు...

వెంటనే ఒక పెన్ తీసుకొని గొంతును వెడల్పుచేసి న్యూస్‌పేపర్‌ను గొట్టంలా మార్చి ఊపిరి తిత్తుల్లోకి గాలిని ఊదారు. మరొకరేమో ఛాతీ నొక్కి గుండె కొట్టుకునే విధంగా చేశారు. ఇలా 25 నిమిషాలపాటు అత్యవసర ప్రాథమిక చికిత్సను అందించగా, బాధితుడికి స్పృహ వచ్చింది కొద్దిసేపటిలో అంబులెన్స్ వచ్చింది. అంబులెన్స్‌లో కూడా వారు సెలైన్ పెడుతూ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

దీంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అంది బాధితుడు కోలుకున్నాడు. దీనిపై మీ స్పందన ఏంటని అడిగితే చాలా సంతృప్తిగా ఫీలయ్యామని డాక్టర్. పైజా అంజుమ్ తెలపగా, ఒక ప్రాణాన్ని కాపాడటం చాలా సంతోషాన్నిచ్చిందని డాక్టర్. సావిత్రిదేవి అన్నారు.

# ప్రజాధనం సక్రమ వినియోగంపై అధ్యయనం

## మోదుగుల

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** ప్రభుత్వం చేసిన చట్టాలు, నిర్ణయాలకు సంబంధించి ప్రజా ధనం కేటాయింపు, వినియోగం, ప్రజా ప్రయోజనం సక్రమ విధానంలో ప్రజలకు చేరుతున్న విషయాలు అధ్యయనం చేసి విశ్లేషణాత్మక నివేదికను సభాపతి ముందుంచి ప్రజాస్వామిక వ్యవస్థను పటిష్ట పరచడమే శాసన సభా సంఘాల ప్రధాన అంశం అని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ మోదుగుల వేణు గోపాలరెడ్డి అన్నారు. రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ శుక్రవారం గుంటూరు జిల్లాలో పర్యటించిన సందర్భంగా స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో కమిటీ సభ్యులు సమావేశమై అధికారులతో చర్చించి విశ్లేషించవలసిన వివరాలను ముందుగా చర్చించుకొన్నారు. అనంతరం కమిటి చైర్మన్ ( వేణుగోపాల రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ తమ కమిటీ నివేదిక శాసన సభాపతి సభ ముందు ఉంచేంత వరకు గోప్యమని, అందుకే చర్చించిన అంశాలను ఏ సభ్యులు ఎట్టి పరిస్థితులలో ముందుగా వెల్లడించకూడదని ఆయన అన్నారు. తమ పర్యటనకు ముందు సభాపతి సూచనల మేరకు ఏ జిల్లాలలో ఏ అంశాన్ని ప్రధానంగా తీసుకొని అధికారులతో చర్చించాలనే విషయాలను ముందుగా నిర్ణయించుకొని పర్యటన జరిపామన్నారు. గుంటూరు జిల్లాలో రాజధాని నిర్మాణం చేపడుతున్నందున సిఆర్‌డిఎను ప్రధాన అంశంగా తీసుకున్నా మన్నారు. ఇప్పటి వరకు సిఆర్‌డిఎ చేపట్టిన వివిధ అంశాలు, వాటి అంచనాలు ఏ మేరకు ప్రగతి సాధించినదీ చర్చించి దీనిపై తదుపరి తీసుకోవలసిన చర్యల గురించి కమిటీ సభ్యులతో చర్చించి సమావేశపు తుది నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఇటువంటి సభా సంఘాలు ప్రపంచంలో రెండు దేశాలలో మాత్రమే ఉన్నాయని, కెనడా తరువాత భారతదేశంలోనే ఈ ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని పాటిస్తున్నారని ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజా స్పందనను తెలుసుకునేందుకు తమ కమిటీ గతంలో జమ్ము కాశ్మీర్, అండమాన్ నికోబార్‌లో పర్యటించి వారు పర్యాటక రంగంలో అనుసరిస్తున్న పర్యాటక విధానాన్ని అధ్య యనం చేయడం జరిగిందని మోదుగుల తెలిపారు. తమ కమిటీలో శాసనసభ్యులు గద్దే రామమోహన్‌రావు, ఎం. గీత, జి. శంకర్. టి.



సిఆర్‌డిఎ అధికారులు, జిల్లా అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ మోదుగుల

శ్రావణ్ కుమార్, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, యు. కల్పన, కె. సర్వేశ్వరరావు, కె. వెంకట రమణ మూర్తి, శాసనమండలి సభ్యులు పి. విశ్వ ప్రసాదరావు, అప్పారావు, ఆదిరెడ్డి, శ్రీనివాసుల నాయుడు తదితరులు ఉన్నారని తెలిపారు. కమిటి సభ్యులందరూ రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏకాభిప్రాయంతో చర్చలను చేపట్టడం జరుగుతుందని, తమకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా ఏకాభిప్రాయ రీతిలో నిర్వర్తిస్తామని కమిటీ సభ్యులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో కమిటీ సభ్యులు సమావేశమై సిఆర్‌డిఎ పరిధిలోని రైతుల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అలాగే జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖలకు నిధుల కేటాయింపు, ఆదాయ వ్యయ వివరాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎం గీత, కల్పన, వెంకట రమణ మూర్తి పాల్గొన్నారు.

# ఘనంగా డా. గరికపాటి శత జయంతి

**రాజధాని ప్రతినిధి, మంగళగిరి :** కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసం అని నినదించిన ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ గరికపాటి రాజారావు శత జయంతి సంవత్సర సభ మంగళగిరిలో జరిగింది. స్థానిక విశ్వశాంతి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు బుద్ధభూమి (మాస పత్రిక) వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య అధ్యక్షత వహించారు. రంగస్థల ప్రయోక్త, కవి, రచయిత కె. శాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభ్యుదయ నట సమాఖ్య సంస్థాపకులు కూర్మాల సుబ్బారావు, కవి, రచయిత, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ అందె నరసింహారావు, మంగళగిరి బుద్ధ విహార ట్రస్టు చైర్మన్ రేకా కృష్ణార్జునరావు, గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, నటులు, అభ్యుదయ కవి, రచయిత సందుపట్ల భూపతి, చేనేత కార్మిక నాయకులు ఆకురాతి రత్నారావు తదితరులు ప్రసంగించారు. ఈ సభకు విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు స్వాగతం పలికారు. స్థానిక కళాకారులు, కవులు, రచయితలు, అభిమానులు సభలో పాల్గొని గరికపాటికి నివాళి అర్పించారు.

# శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల ధరలు భారీగా పెంపు?!

**రాజధాని ప్రతినిధి, తిరుపతి :** తిరుమల శ్రీవారి విఐపి దర్శనంతో పాటు అన్ని రకాల ఆర్జిత సేవా టిక్కెట్ల ధరలు భారీగా పెరగనున్నాయి. జెఈఓ కెఎస్ శ్రీనివాసరాజు నేతృత్వంలో గత శుక్రవారం రాత్రి జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి ఉప కమిటీ సమావేశం ఈ మేరకు సిఫార్సు చేసింది. మూల మూర్తికి నిర్వహించే అర్చన, తోమాల, అష్టదళపాద పద్మ ఆరాధన, అభిషేకం, వస్త్ర సేవా టిక్కెట్లు ధరలను ఎక్కువగా పెంచాలని కమిటీ నిర్ణయించింది. బంగారు వాకిలిలో నిర్వహించే సహస్ర కలశాభిషేకం, తిరుప్పావైతో పాటు ఉత్సవ మూర్తులకు నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను తక్కువ మోతాదులో పెంచాలని సూచించింది. లడ్డూ ధరను యథావిధిగా కొనసాగించాలని, అయితే సర్వ దర్శనం, కాలిబాట భక్తులకు ప్రస్తుతం రూ.10 చొప్పున రెండు లడ్డూలను ఇస్తుండగా ఇకపై ఒక లడ్డూనే ఇవ్వాలని నిర్ణయించింది. తిరుమల తిరుపతిలో అతిథి గృహాల గదులు, కాటేజిలతో పాటు దేశ వ్యాప్తంగా ఉండే కళ్యాణ మండపాల అద్దెలను కూడా 50 నుంచి 100 శాతం పెంచాలని సూచించింది. ఆన్‌లైన్ టిక్కెట్ల ధరలను రూ.300 పెంచాలనుకుంది. ధర్మకర్తల మండలి సమావేశం దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. 2016–2017 సంవత్సరానికి గాను తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బడ్జెట్ రూ.2650 కోట్లు దాటనున్నది.

# హామీలు అమలు చేస్తాం : మంత్రి ప్రత్తిపాటి

**రాజధాని ప్రతినిధి, ఐనవోలు :** రాజధాని గ్రామాల ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ, ఫీజు, రీయింబర్స్‌మెంట్, వైద్యం, ఉపాధి కల్పన తదితర హామీలు పూర్తిగా అమలయ్యేలా చూస్తామని వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం ఐనవోలు పంచాయతి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రులు పుల్లారావు, నారాయణ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆర్డీవో స్థాయి అధికారులుగా ఉన్న సీఆర్‌డిఏ, డిప్యూటి కలెక్టర్లు జవాబుదారీ తనంతో వ్యవహరించడం లేదని పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇప్పటివరకు ఏ విషయంలోనైనా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో సంప్రదించారా అని సీఆర్‌డిఏ డిప్యూటి కలెక్టర్ ఏసు రత్నంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ఐనవోలు గ్రామానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ అమలు కాకపోవడం తమ తప్పేనన్నారు. ఈ గ్రామంలో అన్ని సమస్యలకు బుధవారం నాటికి పరిష్కరించి గురువారం మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# గుంటూరులో ఫిలాటలిన్ ఎగ్జిబిషన్

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** పోస్టల్ శాఖ గుంటూరు జిల్లా స్థాయి ఫిలాటలిన్ ఎగ్జిబిషన్(గుంటూరు పెక్స్–2016)ను స్థానిక బృందావన్ గార్డెన్స్ వద్ద ఉన్న బాలాజీ మండపంలో ఈ నెల 8,9 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పోస్టాఫీసు సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఔత్సాహికులు, స్టాంపుల సేకరణపై ఆసక్తి కలిగి ఇప్పటి వరకు పురాతన స్టాంపులు సేకరించిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ వద్ద ఉన్న స్టాంపులను ప్రదర్శించేందుకు ముందుకు రావలసింగా ఆయన కోరారు. దీనికి సంబంధించిన వివరాలకు గుంటూరు, చంద్రమౌళి నగర్ పోస్టాపీసు సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# సబ్సిడీపై గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ

**రాజధాని ప్రతినిధి, ద్వారాక తిరుమల :** ద్వారకా తిరుమల మండలం నారాయణపురం పంచాయతీలోని గోపాలపురం గ్రామానికి చెందిన 160 మంది నిరుపేదలు గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేసినట్లు సర్పంచ్ వడ్లమూడి సోమరాజ్ తెలిపారు. ఇటీవల జరిగిన జన్మ భూమి కార్యక్రమంలో గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేదలు 160 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గ్యాస్ కనెక్షన్, సిలెండర్ బాండును సోమరాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు కార్యదర్శి స్టాఫ్ పాల్గొన్నారు.

# కళామతల్లి ముద్దు బిడ్డ "గరికపాటి"

(శత జయంతి సంవత్సర ప్రత్యేక వ్యాసం)



డాక్టర్ గరికపాటి రాజారావు! ఆ పేరు వినగానే తెలుగు కళామతల్లి ఒక్కసారి ఆనందాశ్రువులతో ఆప్యాయంగా తన బిడ్డవైపు చూస్తుంది. ఎందుకంటే–కళారంగం రాజులు, జమీందార్లు, జాగీరుదార్లు, కోటీశ్వరుల హృదయోల్లాసానికేనన్న పరిధుల్ని చెరిపి, కళలు రసానందానికేనన్న ఫ్యూడల్‌వ్యాఖ్యలను మొదలంటా ఓడించి, తెలుగు కళామతల్లి చెరను విడిపించిన విముక్తి ప్రదాత ఆయన. కళ కళకోసం కాదు, కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసం అని నినదించిన ప్రజానాట్యమండి స్థాపకుడు ఆయన. ప్రజా కళలకు పట్టం కట్టి సాంఘీక ఇతి వృత్తాలతో సామాన్య ప్రజలను కథానాయకులుగా మలిచి, కళావేదికలను ప్రజల పరం చేసిన ప్రజా కళాకారుడు. ప్రజలను మేల్కొల్పడమే సకల కళల పరమావధి అని చెప్పి, శాసించి, నిరూపించిన కళావేత్త ఆయన. నాటక రంగంలో, సినిమా రంగంలోని ప్రముఖ నటులు, దర్శకులు ఆయన ప్రస్తావన రాగానే వినమ్రంగా చేయెత్తి రెడ్‌శాల్యూట్ చేస్తారు. నట శిక్షణలో ఆయన బోధించిన క్రమ శిక్షణా ప్రమాణాలను ఆత్మీయంగా గుర్తుకు తెచ్చుకుంటారు. ప్రజాకళలకు ఖచ్చితమైన, సమగ్రమైన ప్రామాణిక డిక్షనరీ ఆయన. శరీరం రోగ గ్రస్తమైనప్పుడు వైద్యం ఎంత అవసరమో, సమాజంలో దోపిడీ, పీడనల నిర్మూలనకు కళలు అంతే అవసరమని చాటి, ప్రజల్ని మేల్కొలిపేందుకు కళను శస్త్రంగా, శాస్త్రంగా మార్చిన మార్గదర్శి ఆయన. దేశ సరిహద్దులో పహారా కాసే సైనికుడిలాగా కళాకారుడిపై సామాజిక బాధ్యత వుందని ప్రబోధం చేశాడు.

గరికపాటి రాజారావు తెలుగు సినిమా దర్శకుడు. నాటక రంగ ప్రముఖుడు. ఆంధ్ర ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు. ప్రజా నాట్యమండలి సాంఘీక నాటకాలకు పెద్ద పీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభావంతమైన కళాకారులు పరిచయమయ్యారు. వారిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్‌దాస్, టి. చలపతిరావు, నృత్య దర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు.

రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవ రామలింగమ్మల దంపతులకు జన్మించాడు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్ళి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందాడు. చదువుకుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకంలోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందాడు. తరువాత విజయనగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్‌ఎస్‌ఎల్‌సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరాబాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లోమద్రాసు చేరాడు. మద్రాసులో ఎల్‌ఐఎం చదువుతున్న రోజులలో పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఈయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణం యొక్క ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితుడయ్యాడు. 1943లో బంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మహా సభల్లో ఆంధ్ర ప్రతినిధిగా హాజరై అక్కడ ఏర్పడ్డ 'ఇప్టా'కు అఖిల భారత కార్యదర్శుల్లో ఒకడిగా నియమించబడ్డాడు. వెంటనే రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రజా నాట్యమండలిని ఏర్పరిచి దానికి తొలి కార్యదర్శిగా నియమించబడ్డాడు. ఆ తరువాత ప్రజా నాట్యమండలి తెలుగునేలన విస్తరించింది. అప్పటికే జనాదరణ పొందిన కళారావం "జంగం"ను "బుర్ర కథ" రూపంలోకి మార్చిన ఘనత ఆయనదే. సుంకర సత్యనారాయణ, కాకుమాని సుబ్బారావు తయారు చేసిన "కష్టజీవి" బుర్రకథను ప్రజానాట్యమండలి జనంలోకి తీసుకెళ్ళింది. కోలాటం, సోదివేషం, పిట్టలదొర, జముకుల కథ, యక్షగానం తదితర కళారూపాలు గరికపాటి ఆధ్వర్యంలోనే పునర్జీవం చెందాయి. ప్రజాసమస్యలను నాటక రూపంలో ప్రజలలోకి తీసుకెళ్ళడంలో ప్రజానాట్య మండలికి సాటి మరేది లేదని నిరూపించాడు గరికపాటి. రాజారావు వ్యక్తిగతంగా వీరనారి, వీర కుంకుమ తదితర నాటకాలను రచించాడు. మా భూమి, పరివర్తన, పోతుగడ్డ సీతారామారాజు తదితర నాటకాలకు దర్శకత్వం వహించాడు.

మద్రాసులో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్ళపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎన్‌విఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ నటుడు రూపశిల్పి దేశీ ప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి బాగుబాగు, గాలిబాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు. వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తానే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవాడు. కొంతకాలం రాజమండ్రిలోనూ ప్రజావైద్యశాల నిర్వహించాడు.

ఆ సమయంలో రాఘవ కళా సమితిని ఏర్పరిచి అనేక నాటకాలు ప్రదర్శించారు. రాజారావు 1953లో రాజా ప్రొడక్షన్స్ బానర్‌పై పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశాడు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలు అందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించలేదు. దానితో రాజారావు ఆర్థికంగా దెబ్బతిని అప్పులపాలయ్యాడు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. పేదవారికి ఉచిత వైద్యం చేస్తుండేవాడు. ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నా చితక పాత్రలు కూడా పోషించాడు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశాడు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాల వల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.

ఆ మహనీయుడు భౌతికంగా నిష్క్రమించి 52 సంవత్సరాలైంది. ఆయన రగిలించిన కళా స్ఫూర్తి సమస్త కళా రంగానికి, ప్రజా కళాకారులకు వేగుచుక్కవ వంటింది. ఆయన జీవించింది 48 సంవత్స రాలు మాత్రమే. ఆ జీవితమంతా కూడా ప్రజా కళలకు అంకితం చేసిన త్యాగధనుడాయాన. తెలుగు సాంస్కృతిక రంగంలో ఆయన సృష్టించిన చరిత్ర అజరామరమైనది. అది భావి తరాలకు మార్గదర్శనం చేస్తూనే వుంటుంది. ఆ ప్రజా కళాకోవిదుని శత జయంతి సంవత్సరం సందర్భంగా సమర్పిస్తున్న విప్లవాంజలి ఇదే!

# కుప్పలుగా పేరుకుపోయిన జన్మ భూమి అర్జీలు

❖ 40.54 లక్షలు పెండింగ్

❖ 14.34 లక్షల ఇళ్లు కావాలి

❖ 10 లక్షల మందికి స్థలాలే లేవ్

రాజధాని ప్రతినిధి, విజయవాడ : జన్మభూమి అర్జీలు ప్రభుత్వం వద్ద కొండలా పేరుకుపోతున్నాయి. ప్రజల ఓట్లను కొల్లగొట్టే ప్రధాన శాఖలలోనే మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దాదాపు 80 శాతానికిపైగా దరఖాస్తులను పరిష్కరిం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినా, వాస్తవం అందుకు భిన్నం. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్ మంజూరు పట్టుమని పది శాతం కూడా కనిపించటం లేదు. మూడు విడతల జన్మభూమి మా ఊరు గ్రామసభల్లో ప్రజల నుంచి 70 లక్షల పైచిలుకు అర్జీలచ్చాయి. మొదటి రెండు విడతలల్లోనూ 55.41 లక్షల దరఖాస్తులు రాగా, 33.64 లక్షలను పరిష్కరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి రెండు విడతలలో అన్ని శాఖలకు సంబంధించి 55.41 లక్షల అర్జీలస్తే, కేవలం 34.87 లక్షలే వచ్చినట్లుగా లెక్కలు చూపటం గమనార్హం. మొత్తం 55,41,330 అర్జీలు రాగా, 36,55,999 మాత్రమే పరిష్కరించి, 19,05,293 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. మూడో విడతలో 17 లక్షల అర్జీలురాగా, వాటిలో ఇళ్ల స్థలాల కోసం 3.04 లక్షలు, పింఛన్ల కోసం 2.40 లక్షలు, రేషన్‌కార్డుల కోసం 4.13 లక్షలు, ఇళ్ల నిర్మాణం కోసం 5.02 లక్షలు అర్జీలున్నాయి. గతంలోనే రెండింతల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే, కొత్తగా వచ్చిన అర్జీలతో అధికారులు సతమతమవుతున్నారు. జన్మభూమిలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఎంతో ఆశపడిన వారికి నిరాశే ఎదురవుతోందనటానికి ఈ గణాంకాలే నిదర్శనం.

## ఆర్థిక భారంతోనే పెండింగ్

మూడు విడతల జన్మభూమి గ్రామసభలలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలంటే ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతోనే వచ్చిన అర్జీలను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఆర్థిక భారం లేని సమస్యలను మాత్రమే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇళ్ల స్థలాల సమస్య పదేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. స్థలాల కొరత నేపథ్యంలో ప్రైవేటు భూములను కొనుగోలు చేయాల్సి ఉంది. చంద్రబాబు ప్రభుత్వం ఎన్‌టిఆర్ గ అహ నిర్మాణ పథకం కింద ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు 30 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది కేవలం రెండు లక్షల ఇళ్లనే ప్రభుత్వం మంజూరు చేసింది. రేషన్‌కార్డులు, పింఛన్లను తక్షణమే మంజూరు చేసే అవకాశం ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల నిధులలో కేంద్రం కోత పెట్టటంతో ఆ రెండింటి అమలూ జాప్యమవుతోంది. రాష్ట్రం రెండంకెల వ అద్ధిని సాధిస్తోందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం లక్షలాదిగా పెండింగ్ దరఖాస్తులపై నిర్ణయం తీసుకోకపోవటం గమనార్హం.

### జన్మభూమి దరఖాస్తుల వివరాలు (లక్షలలో)

| అర్జీలు | 1,2 విడతలు | మూడో విడత | పెండింగ్ |
|---|---|---|---|
| స్థలాలు | 6,40,562 | 6,16,776 | 3,04,234 |
| గ అహాలు | 9,45,684 | 9,33,631 | 5,02,314 |
| రేషన్‌కార్డులు | 10,36,508 | 7,58,804 | 4,13,980 |
| పింఛన్లు | 4,95,776 | 3,49,373 | 2,40,830 |

# కనిపించని కార్చిచ్చు క్యాన్సర్



(ఫిబ్రవరి 4 వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా ప్రత్యేక వ్యాసం)




## కేన్సర్ అంటే ఏమిటి?

సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించబడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల అవి చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను "కంతి" (ట్యూమర్) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఆంకాలజీ అంటారు. కాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. కేన్సర్ మహమ్మారి ఏటా రూ.41,17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల కేన్సర్ మరణాలు పేద, మధ్య ఆదాయ దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయం చేయవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

## ట్యూమర్ల రకాలు

**మాలిగ్నెంట్ ట్యూమర్లు :** ఈ రకమైన ట్యూమర్లు నుంచి కొన్ని కేన్సర్ కణాలు విడిపోయి, దేహంలో ఏర్పడిన ప్రాంతం నుంచి వేరొక ప్రాంతంలోకి చేరి ద్వితీయ ట్యూమర్లను ఏర్పరుస్తాయి. ఈ ప్రక్రియను మెటాస్టాసిస్ అంటారు. ఇవి తొందరగా పెరుగుతాయి. ప్రమాదకరం. ప్రాణాంతకమైనవి.

**బినైన్ ట్యూమర్లు :** ఈ రకమైన ట్యూమర్లు సాధారణంగా నెమ్మదిగా పెరిగి, చిన్నవిగా ఉండి, ఒక తంతి యుత పొరచే కప్పబడి స్థానికంగా ఏర్పడతాయి. ఇవి మెటాస్టాసిస్‌ను ప్రదర్శించవు. ఇవి హానికరమైనవి కావు. చిన్న శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు.



## పేర్ల వెనుక కథ

ఇంగ్లీషులో ట్యూమర్ అన్న మాటకి వాపు అని అర్థం. కణాలు విభజన చెంది అతిగా ఒక చోట చేరితే వచ్చే వాపు ఇది. అప్పుడప్పుడు ఈ వాపు చిన్న 'కాయ' రూపంలో తారస పడుతుంది. అప్పుడు దానిని 'కంతి' అంటారు. ఈ కంతి అన్నది రెండు స్వరూపాలలో తారసపడవచ్చు.

1. నిరపాయకరమైన కంతులు 2. ప్రమాదకరమైన కంతులు.

నిరపాయకరమైన కంతులను మూడు లక్షణాల ద్వారా గుర్తు పట్టవచ్చు.

1. అవి నిరవధికంగా, వేగంగా పెరిగిపోవు
2. అవి ఇరుగు పొరుగు కణజాలం మీదకి విరుచుకు పడవు
3. శరీరంలో ఒకచోటి నుండి మరొక చోటికి దండయాత్ర చెయ్యవు.

కొన్ని రకాల కేన్సర్ల పేర్లు ఓమా శబ్దంతో అంతమవుతాయి. కార్సినోమా, సార్కోమా మొదలయినవి. ఇవి కంతి రూపంలో ఉన్నాయని అర్థం. మెలనోమా అంటే మెలనోసైట్‌లు (మెలనిన్ అనే కణాలు) విపరీతంగా పెరిగి కంతిలా ఏర్పడటం. ఈ మెలనిన్ కణాలు మన శరీరపు ఛాయని నిశ్చయించగలవు. అందుకనే పుట్టుమచ్చల కైవారం అకస్మాత్తుగా పెరిగిందంటే వెంటనే వైద్యుణ్ణి సంప్రదించాలి.



### కేన్సర్ రకాలు :

**కార్సినోమా :** (ఉపకళా కణజాలలో ఏర్పడే మలిగ్నెంట్ ట్యూమర్లు) ఈ కేన్సర్‌లు చర్మం, శ్వాస, జీర్ణ మరియు జనన వ్యవస్థలోని ఉపకళా కణాల నుంచి ఏర్పడతాయి లేదా దేహంలోని వివిధ గ్రంధులు ఉదా. క్షీర గ్రంధులు, నాడీ కణజాలం నుంచి ఏర్పడతాయి. మన దేహంలో ఏర్పడే కేన్సర్‌లలో 85 శాతం కార్సినోమా రకానికి చెందినవి.

**సార్కోమా :** సంయోజక కణ జాలాలలో ఏర్పడే మలిగ్నెంట్ ట్యూమర్లు. ఇవి మధ్యస్తం నుంచి ఏర్పడిన కణజాలాలు. అవయవాల నుంచి గాని ఏర్పడతాయి. కేన్సర్‌లలో సార్కోమా సుమారు 2 శాతం ఉంటాయి.

**లుకేమియా :** గ్రీకు భాషలో లూకోస్ అంటే తెలుపు. ఈమియా అంటే రక్తానికి సంబంధించిన, కనుక లూకేమియా అంటే తెల్ల రక్తం అని అర్థం వస్తుంది. రక్తంలో తెల్ల కణాలు బాగా పెరిగినప్పుడు అది లుకేమియా అని పిలవబడుతుంది. ఇది ముఖ్యంగా అస్థిమజ్జలో ఉన్న తెల్ల కణాలను ప్రభావితం చేస్తుంది. దీనిని 'ద్రవరూప కంతి' అని కూడా అంటారు. దేహంలో ఏర్పడే ట్యూమర్లలో ఇవి 4 శాతం ఉంటాయి.

**లింపోమా ప్లీహం :** శోషరస గ్రంధులలోని తెల్ల రక్తకణాలలో ఏర్పడే మాలిగ్నెంట్ ట్యూమర్లు. దేహంలో ఏర్పడే ట్యూమర్లలో ఇవి ఇంచుమించు 4 శాతం ఉంటాయి.

### కేన్సర్ సూచికలు :

మానని పుండు (అల్సర్)
అసహజమైన రక్త స్రావం (బ్లీడింగ్)
పెరుగుతున్న కంతి (టూమర్)
తగ్గని దగ్గు, బొంగురు గొంతు
మలంలో రక్తం, మల విసర్జనలో మార్పు
తగ్గని అజీర్తి, మింగుట కష్టం
పుట్టుమచ్చలలో మార్పు

### కేన్సర్ ఉత్పరివర్తనాలు :

- వైరస్ అంకో జన్యువుల ప్రభావం
- ట్యూమర్ అణచివేత జన్యువులను కోల్పోవడం. వాటిలో ఉత్పరివర్తనాలు కలగటం లేదా వాటిని ఉత్తేజ రహితం గావించడం
- డిఎన్‌ఎ రిపేర్ జన్యువులను కోల్పోవడం. వాటిలో ఉత్పరివర్తనాలు కలగటం లేదా వాటిని ఉత్తేజ రహితం గావించడం
- క్రోమోజోములు అరుదుగా భ్రంశనంకు గురికావడం

పైన చెప్పిన అన్ని లేదా కొన్ని మార్పులు యాదృచ్ఛికంగా గాని లేదా అనేక కారకాల వల్ల జరగవచ్చు. ఈ మార్పులను ప్రేరేపించే కారకాలు కొన్ని రకాల కాలుష్యాలు, రేడియేషన్, పొగాకు, ఆల్కహోల్, ఔషధాలు, రసాయనాలు

### కేన్సర్ వచ్చే శరీర భాగాలు :

కేన్సర్ మన శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే ప్రమాదం ఉంది. అయినా గర్భాశయం, రొమ్ము కేన్సర్, ఊపిరితిత్తులు, పేగులు, శ్వాసనాళాలు మొదలైన భాగాలకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువ.

### కేన్సర్‌ను చంపే పసుపు :

పసుపునకు కేన్సర్ కణాలను తుదముట్టించే సామర్థ్యం ఉన్నట్లు, పసుపులో ఉండే కర్కుమిన్ అనే రసాయనానికి 24 గంటల్లోపే కేన్సర్ కణాలను చంపేస్తున్నట్లు పరిశోధకులు తేల్చారు. కర్కుమిన్‌కు గాయాలు నయం చేయడంతో పాటు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించే శక్తి ఉంది.

## రామోజీ, యార్లగడ్డ, సానియా

# వికసించిన పద్మాలు

న్యూఢిల్లీ : దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ విభూషణ్ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేషకృషి చేసిన వారికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రం సోమవారం పద్మఅవార్డులను ప్రకటించింది. మొత్తం 112 మందికి ఈ అవార్డులను ప్రతిపాదించగా రాష్ట్రపతి ఆమోదించారు. రజనీకాంత్, రామోజీరావులతో సహా 10 మందికి పద్మవిభూషణ్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డి. నాగేశ్వర్‌రెడ్డి సహా 19 మందికి పద్మభూషణ్, లక్ష్మాగౌడ్, ఎస్, ఎస్ రాజమౌళి సహా 83 మందికి పద్మశ్రీపురస్కారాలను ప్రభుత్వం అందచేయనుంది. ఈ జాబితాలో మొత్తం 19 మంది మహిళలు ఉండగా, పదిమంది విదేశీయులు, ప్రవాస భారతీయులు, భారత సంతతికి చెందిన వారు ఉన్నారు. కళలు, సామాజిక సేవ, ప్రజాసంబంధాలు, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌరసేవలు వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను ప్రకటిస్తారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే ఈ అవార్డులను ఏటా మార్చి, ఏప్రిల్‌లో జరిగే ప్రత్యేక వేడుకలో రాష్ట్రపతి ప్రదానం చేస్తారు. ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపికైన వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాష్ట్రాలకు చెందిన మొత్తం 14 మంది తెలుగువారు ఉన్నారు. పద్మవిభూషణ్ పురస్కారాల జాబితాలో యామినీ కృష్ణమూర్తి, రామోజీరావులకు చోటు దక్కింది.

పద్మభూషణ్ పురస్కారాల జాబితాలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుడు ప్రొఫెసర్ డి.నాగేశ్వరరెడ్డి, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ ఆళ్ల వెంకట రామారావు, క్రీడల్లో సైనానెహ్వాల్, సానియా మీర్జాలకు చోటు దక్కింది. ఇక పద్మశ్రీ అందుకోనున్న వారిలో దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి, పెయింటింగ్‌లో కె. లక్ష్మాగౌడ్, వైద్యంలో డాక్టర్ మన్నం గోపీచంద్, డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, డాక్టర్ నాయుడమ్మ, యార్లగడ్డ, సామాజిక సేవ రంగంలో సునీత కృష్ణన్, డాక్టర్ టి.వి నారాయణ ఉన్నారు.



ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపిక చేసిన 112 మందిలో 12 మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందన వారున్నారు. నలుగురు ఎస్సీ, నలుగురు ఎస్టీ, నలుగురు ఓబీసీ ఉన్నట్లు కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారిలో అత్యధికంగా 18 మంది ఢిల్లీ నుంచి ఉంటే.. మహారాష్ట్రకు చెందిన 16 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి 12 మంది, కర్ణాటక నుంచి 11 మంది ఉన్నారు.

## ఏపీ ప్రధాన సీఎస్‌గా సత్యప్రకాశ్ టక్కర్

**హైదరాబాద్ :** ఊహించినట్టే రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శి సీఎస్‌గా సత్యప్రకాశ్ టక్కర్ నియమితులయ్యారు. 1981 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సీనియర్ అధికారి అయిన టక్కర్‌ను సీఎస్‌గా నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టక్కర్ ప్రణాళికా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో టక్కర్ శనివారం సాయంత్రం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఆగస్టు వరకు ఈ పదవిలో ఆయన కొనసాగుతారు. ఆగస్టు నెలాఖరుకు పదవీ విరమణ చేస్తారు. సీనియారిటి ప్రకారం చూస్తే ఐవైఆర్ తరువాత 1980 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అశ్వనీ కుమార్ ఫరిడా సీఎస్ అవ్వాల్సి ఉంది. ఐతే బాక్సైట్ వివాదంలో ప్రభుత్వంలోని ముఖ్య నేతకు ఫరిడా అనుసరించిన వైఖరి నచ్చ లేదు. దీనికి తోడు సిఎం పదవి చేపట్టినప్పటి నుంచి చంద్రబాబకు చెబుతూ వస్తున్న గ్రిడ్లు, మిషన్లు, డబుల్ డిజిట్ గ్రోత్‌లపై టక్కర్ తొలి నుంచి ప్రజంటేషన్లు రూపొందించి ఆయనకు అందచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎస్ పదవి నియామకంలో టక్కర్ వైపే చంద్రబాబు మొగ్గు చూపారు. ఐవైఆర్ సేవలకు గుర్తుగా మరో వైపు నెలాఖరుకు సిఎస్‌గా పదవీ విరమణ చేయనున్న కృష్ణారావును బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చక ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు ఛైర్మన్‌గానూ నియమించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి జెఎస్‌వి ప్రసాద్ శుక్రవారం రెండు జీవోలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఐవైఆర్ మూడేళ్ళపాటు పదవిలో కొనసాగుతారు. ఛైర్మన్ హోదాలో ఐవైఆర్‌కు నెలసరి అలవెన్సులు, సిబ్బంది సంఖ్యను కూడా ఖరారు చేస్తూ ఉత్త ర్వులలో పేర్కొన్నారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయించడంలో సీఎస్ హోదాలో కృష్ణారావు కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఆయననే కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

## గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ

**రాజధాని ప్రతినిది, పిఠాపురం :** తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన అదనపు గదులను స్థానిక ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ప్రారంభించారు. విద్యాశాఖ అనుమతితో రూ.65 లక్షల ఆర్ఐడీఎఫ్ నిధులతో ఈ గదులను నిర్మించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు క్లాస్ రూమ్‌లు ఇరుకుగా ఉండటమే కాకుండా, విద్యార్థులను ఆరుబయటనే కూర్చోపెట్టి పాఠాలు బోధిస్తున్నారు. దీంతో అదనపు గదులను నిర్మించారు. ఈ సందర్భంగా వర్మ విద్యార్థులకు స్వఛ్చాభారత్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సాయి బాబా, రెడ్డి భాస్కరావు, చిక్కిరెడ్డి వెంకటరమణ, అధ్యాపకులు, విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ


## కామినేనిని పరామర్శించిన కోడెల



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్య శాలలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి డా. కామినేని శ్రీనివాసస్ మోకీలు శస్త్ర చికిత్స చేయించుకొని ప్రభుత్వ ఆసుపత్రులపై సామాన్య ప్రజలలో నమ్మకం కలిగించారని రాష్ట్ర శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద రావు అన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతున్న మంత్రి శ్రీనివాస్‌ను ఇటీవల కోడెల పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మంత్రి పదవిలో ఉండి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందడం వల్ల సామాన్య ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే కాయి విదేశాలలో సైతం పేరొందిన గొప్ప డాక్టర్లలో చాలా మంది గుంటూరు ప్రభుత్వ కళాశాల నందు విద్యనభ్యసింఇచిన వారేనని సభాపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్పొరేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో సామాన్య ప్రజలకు మెరుగైనవైద్య సేవలు అంఇస్తున్నట్లు సభాపతి తెలిపారు. ఇంకా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అనేక రకాల శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజానాయుడు, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

## పర్యాటక రంగంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

### నేషనల్ టూరిజం డే సందర్భంగా జర్నలిస్ట్ సంపాదకుడు కృష్ణంరాజు



సభలో మాట్లాడుతున్న వక్తలు

**రాజధాని ప్రతినిధి, నాగార్జున యూనివర్సిటి :** ఆంధ్రప్రదేశ్‌కు టూరిజం రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉందని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జర్నలిస్టు ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నేషనల్ టూరిజం డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణంరాజు మాట్లాడుతూ సుమారు 900 కిలోమీటర్ల సాగర తీరం, అనేక చారిత్రక ప్రదేశాలు, పురాతన కట్టడాలు ఉన్న ఆంధ్ర ప్రదేవ్‌లో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే వేలాది మందికి ఉపాధి లభించడమే కాక వందలాది కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా ఆర్జించవచ్చునన్నారు.

థాయ్‌ల్యాండ్, మలేషియా, సింగపూర్ లాంటి చిన్న దేశాలు టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి తమ దేవాలను అభివృద్ధి పర్చుకున్నాయన్నారు. ఇకో టూరిజం, మెడికల్ టూరిజం, అడ్వెంచర్ టూరిజంపై మన రాష్ట్రం ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన సలహా ఇచ్చారు. ఈ ప్రపంచంలో ఎటువంటి కాలుష్యాన్ని వెదజల్లకుండా పెద్ద ఎత్తున ఉపాధిని, ఆదాయాన్ని సమకూర్చే పరిశ్రమ ఏదైనా ఉందంటే అది టూరిజం ఇండస్ట్రీ మాత్రమేనని ఆయన చెప్పారు. నిజానికి టూరిజం విషయంలో మనం పొరుగునే ఉన్న కేరళ, కర్నాటక, తమినాడు కన్నా వెనుకబడి ఉన్నామని దీనిని దృష్టిలో ఉంచుకుని అమరావతి ప్రాంతాన్ని ఒక ఉత్తమ పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆయన అన్నారు.

గౌతమ బుద్ధుడిని ప్రపంచంలో మొట్టమొదటి టూరిస్టుగా భావించవచ్చునని ఆయన అంటూ ఆనాటి సమాజ అధ్యయనం కోసం ఆయన అప్పట్లో దేశమంతటా తిరిగారని చెప్పారు. మన రాష్ట్రంలో అనేక ప్రాచీన బౌద్ధారామలు ఉన్నాయని, వీటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దితే చైనా, ఆగ్నేయ ఆసియా, శ్రీలంక వంటి దేశాల నుంచి యేటా లక్షలాది మంది యాత్రీకులను ఆకర్షించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం టూరిజం, హాస్పిటాలిటి మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణ చంద్రరావు, జర్నలిజం విభాగానికి చెందిన డాక్టర్ మధుబాబు, రెహ్మాన్ సాహెబ్‌తో పాటు రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు నేషనల్ టూరిజం డే ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథితో కేక్ కట్ చేయించారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

### - కలెక్టర్ కాంతిలాల్ దండె

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో వుండి నాణ్యమైన వైద్యం అందుతుందనే నమ్మకాన్ని సామాన్య ప్రజల్లో కల్పించాల్సిన అవసరమున్నదని, దీనికి గాను ప్రభుత్వ వైద్యులు అందరూ చిత్త శుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఎన్టీఆర్ ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల సేవలు, ఉచిత టెలిరేడియాలజి సేవలు, 102 కాల్ సెంటర్, తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్, వైద్య పరికరాల నిర్వహణ తదితర అంశాలపై జిల్లాలోని ప్రభుత్వ వైద్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పై అన్ని సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు అందరూ ఈ వైద్యసేవలపై అవగాహన కల్పించుకొని సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 19 రకాల ఉచిత వైద్య పరీక్షలు, కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలలో 40 రకాల ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించ బడతాయన్నారు. ప్రభుత్వం అందించే ఎన్.టి.ఆర్. వైద్యసేవలపై సామాన్య ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మారుమూల, గిరిజన ప్రాంతాల లోనిప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను అందుబాటులోనికి తీసుకొని రావాలన్నారు. జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించాలని, ఎంతమంది గర్భవతులునమోదైన వున్నారు. వారికి సరైన సమయంలో వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయాన్ని వైద్యాధికారులు తప్పక పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజానాయుడు, ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ జయ చంద్రా రెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా శాలినీ, డా. శారదా, జిల్లా వైద్య, ఆరోగ్య, శాఖాధికారిణి డాక్టర్ పద్మజా జిల్లాలోని ప్రభుత్వ డాక్టర్లు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జ్యోతిని వెలిగిస్తున్న ఉపసంచాలకులు కిరణ్‌కుమార్, విద్యార్థినుల ప్రదర్శన

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** 67వ గణ తంత్ర దినోత్సవాల సందర్భంగా జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ కాంతిలాల్ దండె ఆదేశాల మేరకు, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆనందపరిచాయి. గుంటూరు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను సమ్మోహన పరిచాయి. ముఖ్యంగా శుభగాత్రి చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. రాజాగారితోటలోని సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఆలపించిన దేశభక్తి గేయాలు కూడా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సమాచార శాఖ ఉప సంచాలకులు పి. కిరణ్‌కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి టి. పూర్ణచంద్రరావు, విద్యార్థినులకు మెమెంటోలు అందజేశారు.



బాలబాలికల నృత్య, జానపద ప్రదర్శనలు

## రవీంద్రుడు మెచ్చిన కవి, సమసమాజ స్ఫూర్తి మఖ్దూం

### ఫిబ్రవరి 4న మఖ్దూం మొహియుద్దీన్ 108వ జయంతి సందర్భంగా

ప్రపంచ ప్రజల క్షేమం, కార్మిక వర్గ సౌభాగ్యం కోరుతూ పోరుబాటను ఎన్నుకున్న మహనీయుడు మఖ్దూం మొహియుద్దీన్. 1908 ఫిబ్రవరి 4న ప్రస్తుత తెలంగాణలోని మెదక్ జిల్లా ఆందోల్ గ్రామంలో జన్మించిన మఖ్దూం పూర్తిపేరు అబూ సయిాద్ మహ్మద్ మఖ్దూం మొహియుద్దీన్ ఖాద్రి. తండ్రి గౌస్ మొహియుద్దీన్ తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగి. అతని నాలుగేండ్ల వయస్సులో తండ్రి మరణించడంతో పినతండ్రి బషీరుద్దీన్ ఇంట పెరిగారు. పినతండ్రి ఇంట భోజన సమయంలో దస్తర్ మీద అంతా ఆసీనుల య్యాక, భారతదేశంలో సాగుతున్న జాతీయోద్యమం విశేషాలతోపాటు రష్యాలో ప్రజలు సాధించిన విజయాలను, ఆ విజయాల పర్యవసానంగా ప్రజాజీవనంలో రానున్న మార్పులను ఆయన వివరించారు. ఆర్థిక-సాంఘిక అసమానతలు లేని సమాజం గురించి పినతండ్రి చెప్పిన మాటలు పదేళ్ల మఖ్దూంను ఆకట్టుకున్నాయి. మెదక్ జిల్లా సంగారెడ్డిలో మెట్రిక్యులేషన్ పూర్తిచేసిన మఖ్దూం ఉన్నత చదువుల కోసం 1929లో హైదరాబాదు చేరుకున్నాడు. పరిహాసాలకు, అల్లరికి ఎప్పుడూ ముందుండే మఖ్దూం సహాధ్యాయులందరికీ అప్తుడు. జమాలుద్దీన్ జోక్స్ అంటూ ప్రసిద్ధి చెందిన జోక్స్‌లో కన్పించే జమాలుద్దీన్ పాత్రను మఖ్దూం స్వయంగా సృష్టించారు. ఉర్దూనాటకం మీద పరిశోధనా పత్రం సమర్పించి ఆయన డాక్టరేట్ సాధించారు. మొదట చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ వచ్చిన ఆయన 1929లో హైదరాబాద్ సిటీ కాలేజ్‌లో అధ్యాపకునిగా చేరారు. ప్రజలు అనుభవిస్తున్న కష్టనష్టాలు, అలవికాని, దాస్యాన్ని మఖ్దూం నిశితంగా పరిశీలించారు. ముస్లింలు- హిందువులలోని కొన్ని వర్గాలు, సంస్థలు ఇరువర్గాల మధ్య తగాదాలను సృష్టిస్తున్న పరిస్థితులు ఆయనకు ఆందోళన కలిగించాయి. ఆరోజుల్లో 'నిగార్' పత్రికలో నియేజ్ ఫతేపూర్ అనే పాత్రికేయుడు హేతువాద దృష్టితో రాసే వ్యాసాలు, కవితలు ఆయన్ను ఆకట్టుకునేవి. 1934లో 'టూర్' అనుభావ గీతం ద్వారా తనలోని కవితా తృష్ణకు అక్షరరూపం కల్పించారు. ఫాసిజానికి, బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఆయన రచించిన 2 విదురుల గృహాలు' విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ ప్రశంసలు అందుకుంది. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి కూడా ఆయన నాటకాలు రాసి ప్రదర్శించారు. 1936లో ది అంజుమానే తరిఖీ - ఇ- ఉర్దూ అను ప్రగతిశీల రచయితల సంఘాన్ని స్థాపించారు. అఖ్తర్ హుస్సేన్ రాయపురి లాంటి వారితో కలసి సరోజిని నాయుడు గృహమైన 'స్వర్ణ దేహి'లో సమకాలీన రాజకీ యాల మీద, ఉర్దూ సాహిత్యం మీద జరిగే చర్చల్లో చురుగ్గా పాల్గొంటూ చక్కని సాహిత్య సృష్టికి పునాదులు వేసుకున్నారు. 1939లో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఆ సమయంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సిపాయి, అంధేరా అనే గేయాలు రాశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఒక సమావేశంలో దేశీయ ప్రభుత్వం రావాలని మఖ్దూం ఆకాంక్షించారు. ఆగ్రహించిన ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి మూడు మాసాల జైలు, 250 రూపాయల జరిమానా విధించింది. 1946లో పారిశ్రామిక వాడల్లోని కార్మికుల సంక్షేమానికి సంబంధించి చట్టాలు లేక పడుతున్న ఇక్కట్ల పరిష్కారానికి మఖ్దూం నడుంకట్టారు. దానిలో భాగంగా హైదరాబాద్ రాష్ట్ర కార్మిక సంఘాన్ని స్థాపించి, అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వియన్నాలోని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యాలయంలో పనిచేసేందుకు ఎన్నికయ్యారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించాక, 1948లో పోలీసు చర్య పూర్తయిన తరువాత ఆయన అజ్ఞాతం నుంచి బయటకు వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను మళ్లీ 19523లో అరెస్టు చేసినా తరువాతి ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విడుదల చేసింది. ఆ ఎన్నికల్లో పీపుల్స్ డెమాక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా హైదరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయిన ఆయన ఆ తరువాతి జరిగిన ఉపఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. కార్మిక నాయకుడిగా, ఉర్దూకవి, రచయితగా లబ్ధప్రతిష్ఠులయ్యారు.

కవిగా మఖ్దూం అగ్నిగుండం, తెలంగాణ, నిరీక్షణ, ఫగ్‌పూర్ ఆత్మ, లాంటి గేయాలు రాశారు. ఆజాదీ-ఏ-వతన్ అను ేగయంలో భారత దేశం భవిష్యత్తును మార్చేసేందుకు యువకులు ఉవ్వెత్తున ఉరుకులు పెట్టాలని ఉద్బోధించారు. తెలంగాణ ప్రాంతంలోని ప్యూడలిజాన్ని 'హవేలి' అనే గీతంలో దుయ్యబట్టారు.


మఖ్దూం మొహియుద్దీన్

# చరిత్ర సృష్టించారు

**మెల్‌బోర్న్ :** ఆస్ట్రేలియా గడ్డపై భారత క్రికెట్ పురుషుల, మహిళల జట్లు చరిత్ర సృష్టించాయి. ఒకే రెండు జట్లు ఆతిథ్య జట్లతో జరిగిన రెండో టీ 20లో అద్భుత విజయాలు సాధించి తొలిసారి ఆ దేశంలో ద్వైపాక్షిక సిరీస్‌ను సాధించాయి. వన్డే సిరీస్‌ను సాధించిన ఆసీస్ జట్టు టీ 20ను సైతం కైవసం చేసుకోవాలన్న ఆశలపై టీమిండియా నీళ్లు చల్లింది. రెండు మ్యాచ్‌ల్లోనూ అన్ని రంగాల్లో మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థికి చుక్కలు చూపించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో కైవసం చేసుకుంది. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ, విరాట్‌కోహ్లి, శిఖర్‌ధావన్, సురేష్‌రైనా, బౌలింగ్‌లో అశ్విన్, జడేజా, బుమ్రా, యువరాజ్‌లు రాణించడంతో జట్టు అలవోకగా విజయాలు సాధించింది.

• ఆసీస్ గడ్డపై తొలి ద్వైపాక్షిక సిరీస్ విజయం • రెండో టీ 20లో టీమిండియా గెలుపు • సిరీస్ సాధించిన పురుషుల, మహిళల జట్లు


ఆనందోత్సాహంలో టీమిండియా ఆటగాళ్లు

### రెండో టీ 20లో ఘన విజయం

ఆసీస్‌తో గత శుక్రవారం జరిగిన రెండో టీ 20 మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. రోహిత్ శర్మ 60 (47 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్స్‌లు), విరాట్ కోహ్లి 59 నాటౌట్ (33 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌లు), శిఖర్ ధావన్ (42, బంతుల్లో 5 ఫోర్లు, రెండు సిక్స్‌లు) చెలరేగడంతో మొదటి మూడు వికెట్లకు భారత్ 184 పరుగులు చేసింది. బదులుగా ఆస్ట్రేలియా 157-8కే పరిమితమైంది. ఫించ్ 74 (48 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్స్‌లు) సాధించినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. ఓపెనర్ మార్ష్ (23 పరుగులు)తో కలసి ఫించ్ చెలరేగడంతో ఆసిస్ వేగంగా పరుగులు సాధించింది. కానీ పదో ఓవర్లో మార్ష్‌ను అశ్విన్ ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తరువాత వరుసగా ఆసీస్ వికెట్లు కోల్పోయింది. లిన్(2)ను పాండ్య, మాక్స్‌వెల్(1)ను యువరాజ్ ఔట్ చేశారు. 14వ ఓవర్లో ఆసీస్ మూడు వికెట్లు కోల్పోయి 119 వద్ద ఉంది. ప్రమాదకర వాట్సన్ (15) క్రీజులో ఉండడంతో ఆసీస్ పరుగుల వేట సాగించింది. 15వ ఓవర్లో అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో వాట్సన్‌ను జడేజా పెవిలియన్‌కు పంపడంతో టీమిండియా పట్టు సాధించింది. తర్వాతి ఓవర్లో ఫించ్ రనౌట్ అయ్యాడు. జడేజా వేసిన 17వ ఓవర్లో ఫాల్కనర్ (10) స్టంపౌట్ కావడంతో భారత్ విజయం ఖరారైంది. రెండు మ్యాచ్‌ల్లోనూ అద్భుతంగా రాణించిన విరాట్ కోహ్లికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు దక్కాయి.


సిరీస్ గెలిచిన ఆనందంలో భారత మహిళా క్రికెట్‌జట్టు

### మహిళా క్రికెట్ జట్టు విజయం

ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై భారత మహిళా క్రికెట్ జట్టు ఓడించి టీ 20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. గత శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో మిథాలీ సేన 10 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ 18 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. వర్షం కురవడంతో భారతకు పదిఓవర్లలో 66 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చారు. భారత్ వికెట్లేమీ కోల్పోకుండా 9.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ మిథాలీ రాజ్ 37 నాటౌట్, స్మృతి మందన 22 నాటౌట్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

## తొలి టీ 20లో టీమిండియా అద్భుత ప్రదర్శన

**రాజధాని, అడిలైడ్ :** ఆస్ట్రేలియాతో జనవరి 26న జరిగిన తొలి ట్వంటీ 20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. ఐదు వన్డేల సిరీస్‌ను 1-4తో కోల్పోయిన టీమిండియా ఒత్తిడిని అధిగమించి టీ20 సిరీస్‌లో శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లి దుమ్ము రేపడంతో పాటు రోహిత్ శర్మ, సురేష్ రైనా బాధ్యతాయుతంగా ఆడడం, తొలి టీ 20 మ్యాచ్ ఆడిన బుమ్రా మూడు వికెట్లు తీయడం, జట్టు సమిష్టిగా ఆడడం వెరసి ఆసీస్‌ను టీమిండియా కంగుతినిపించింది. వన్డే సిరీస్ కోల్పోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ ధోనీకి ఈ విజయం ఊరటనిచ్చింది. తొలుత టాస్ గెలిచిన ఆసీస్ బ్యాటింగ్ చేయాల్సిందిగా టీమిండియాను కోరింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్‌ధావన్‌లు తొలి వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం అందించింది. రోహిత్ దూకుడుగా ఆడి 31 పరుగులు చేశాడు. ధావన్ 5 పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అతడి స్థానంలో వచ్చి విరాట్ కోహ్లి ఆస్ట్రేలియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడు 55 బంతుల్లో 9 ఫోర్లు, రెండు సిక్స్‌ల సాయంతో 90 పరుగులు చేశాడు. బౌండరీల మోత మోగించాడు. వాట్సన్ బౌలింగ్‌లో ఫాల్కనర్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ శర్మ ఔట్ కావడంతో సురేష్ రైనా బ్యాటింగ్‌కి వచ్చాడు. ఫాంలోకి వచ్చిన రైనా కోహ్లికి సహకరించాడు. పది ఓవర్లలో స్కోరు 79కి చేరగా, కోహ్లి దూకుడు పెంచడంతో 13వ ఓవర్లలో 100 దాటింది. ఇద్దరూ ఫోర్లు, సిక్స్‌లతో అద్భుతంగా ఆడి మూడో వికెట్‌కు 134 పరుగులు జోడించారు. చివరి ఓవర్లో రైనా 41 పరుగుల వద్ద ఔట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ ధోనీ 11 పరుగులు, కోహ్లి 90 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచారు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 188 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో ఫాల్కనర్‌కు ఒకటి, వాట్సన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు ఆసీస్ ఓపెనర్లు ఫించ్, వార్నర్‌లు మంచి ప్రారంభాన్ని ఇచ్చారు. అరగేట్రం చేసిన బుమ్రా నాలుగో ఓవర్లో కేవలం మూడు పరుగులే ఇచ్చాడు. ఆరో ఓవర్లో అతడు వార్నర్ (17)ను ఔట్ చేయడంతో ఆసీస్ పతనం ప్రారంభమైంది. అయితే స్మిత్ (21)తో కలసి ఫించ్ రెండో వికెట్‌కు 42 పరుగులు జోడించడంతో 8.5 ఓవర్లలో 88 పరుగులకు ఆసీస్ ఒక వికెట్‌ను నష్టపోయింది. అనంతరం స్పిన్నర్లు రవీంద్ర జడేజా, అశ్విన్‌లు ఆసీస్‌ను దెబ్బతీశారు. తొమ్మిదో ఓవర్లో చివరి బంతికి స్మిత్‌ను జడేజా వెనక్కి పంపగా, 10 ఓవర్లో ఫించ్‌ను అశ్విన్ ఔట్ చేశాడు. తర్వాతి ఓవర్లోనే ట్రానిస్ హెడ్‌ను జడేజా పెవిలియన్‌కు పంపాడు. ఆసీస్ నాలుగు పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు చేజార్చుకుంది. 11వ ఓవర్లో నాలుగు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసిన ప్రత్యర్థి జట్టుపై భారత బౌలర్లు ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భారీ షాట్ ఆడబోయిన వాట్సన్ షార్ట్ ఫైన్ లెగ్‌లో నెహ్రాకు దొరికిపోయాడు. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన క్రిస్ లిన్ (17) పాండ్య బౌలింగ్‌లో యువరాజ్‌కు అందుకున్న చక్కని క్యాచ్‌కి నిష్క్రమించాడు. చివరి మూడు ఓవర్లలో ఆసీస్‌కు 53 పరుగులు అవసరమయ్యాయి. ఫాల్కనర్ క్రీజ్‌లో ఉండడంతో ఆసీస్ ఆశలో కోల్పోలేదు. కానీ బుమ్రా వెంటనే కళ్లు చెదిరే యార్కర్‌తో అతడిని బౌల్డ్ చేయడంతో భారత్ విజయం ఖరారైంది. బుమ్రా 3 వికెట్లు, జడేజా, పాండ్య, అశ్విన్ రెండు వికెట్లు చొప్పున, ఆశిష్ నెహ్రా ఒక వికెట్ తీసుకున్నాడు. గణతంత్ర దినోత్సవం నాడు టీమిండియా టీ 20 విజయాన్ని సాధించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది.


కప్‌ను ముద్దాడుతున్న హింగిస్, సానియా

## ఎదురులేని సానియా-హింగిస్

### ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కైవసం

**మెల్‌బోర్న్ :** మహిళా టెన్నిస్ డబుల్స్‌లో ప్రపంచ నంబర్ వన్ జోడీ సానియా మీర్జా, మార్టినా హింగిస్‌లు అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్నారు. గత శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ జోడి ఏడో సీడ్ ఆంద్రియా, హ్లావకోవా, లూసీ హ్రాదేకాలపై వరుస సెట్లలో 7-6, (7-1) 6-3తో విజయం సాధించారు. గంట 45 నిముషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో రెండు జోడీలు సర్వీస్ నిలబెట్టుకునేందుకు తీవ్రంగా కష్టించాయి. తొలి సెట్లో వరుసగా ఎనిమిది సర్వీసులు బ్రేక్ కావడం విశేషం. ఒక దశలో స్కోరు 5-5తో సమమై టై బ్రేక్ అనివార్యమైంది. టై బ్రేక్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సానియా జోడీ బలమైన గ్రౌండ్ స్ట్రోక్‌లు, ఫోర్‌హ్యాండ్ షాట్‌లతో ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేసిన సానియా జోడీ 5-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. తరువాత పదునైన ఫోర్‌హ్యాండ్ షాట్‌లతో చెక్ జోడీ సర్వీస్ బ్రేక్ చేసిన సానియా టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఈ టైటిల్‌తో మొత్తం ఆరు గ్రాండ్ స్లామ్‌లు వీరు సాధించారు. గత ఏడాది వింబుల్డన్, యుఎస్ ఓపెన్ టైటిళ్లను సాధించిన విషయం విదితమే.

## యువ జట్టు విజయభేరి

**మిర్పూర్ (బంగ్లాదేశ్) :** అండర్ 19 ప్రపంచకప్‌లో యువ భారత్ తొలి మ్యాచ్‌లోనే విజయం సాధించింది. గత గురువారం జరిగిన తొలి వన్డేలో యువ క్రీడాకారులు సమిష్టిగా ఆడి 79 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 9 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. ఒక దశలో 55కే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రికీ భుయ్ 39 పరుగులకే ఔటయ్యాడు. ఈ దశలో సర్ఫరాజ్ ఖాన్ 74 (70 బంతుల్లో ఏడు ఫోర్లు), వాషింగ్‌టన్ సుందర్ 62(71 బంతుల్లో 3 ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు 17.2 ఓవర్లలో 110 పరుగుల జోడించి భారత్ స్కోరును 268కి తీసుకువెళ్లారు. అనంతరం లక్ష్యఛేదనలో వెనుకబడిన ఐర్లాండ్ 49.1 ఓవర్లలో 189 పరుగులకే చేతులెత్తేసింది. 16.2 ఓవర్లలో 46కే నాలుగు వికెట్లు కోల్పోయింది. టకర్ 57, విలియమ్ మెక్ క్లింటాక్ 58 అర్ధ సెంచరీలు చేసి జట్టును ఆదుకున్నారు. మెక్ క్లింటాక్‌ను ఔట్ చేసి రాహుల్ (3-15) వారి భాగస్వామ్యాన్ని విడదీశాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్ ఎవరూ రెండంకెల స్కోరు కూడా చేయకపోవడంతో ఐర్లాండ్ ఓటమి పాలైంది. సర్ఫరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ లభించింది.


ఐర్లాండ్‌పై విజయం సాధించిన అండర్ 19 ఇండియా జట్టు

### న్యూజిలాండ్‌కు నేపాల్ ఝలక్

అండర్ 19 ప్రపంచకప్‌లో నేపాల్ సంచలన విజయం సాధించింది. 32 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మొదట 238 (ఏడు వికెట్లకు) పరుగులు చేసిన నేపాల్ 206 పరుగులకే కివీస్‌ను ఓడించింది. కాగా, ఇతర మ్యాచ్‌ల్లో ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్థాన్, కెనడాపై శ్రీలంక విజయం సాధించాయి.

## సయ్యద్ మోడీ గ్రాండ్ ప్రీలో సింధుకు షాక్



**లక్నో :** సయ్యద్ మోడీ గ్రాండ్ ప్రీ గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి పివి సింధు నిష్క్రమించింది. ప్రి క్వార్టర్స్‌లోనే ఆమె కథ ముగిసింది. గత గురువారం హోరాహోరీగా సాగిన పోరులో మూడో సీడ్ సింధు 21-18, 24-26, 17-21తో ప్రపంచ నెం27వ షట్లర్ నిచావోన్ జిందాపోల్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. గంట 28 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను సింధునే గెలిచింది. రెండో గేమ్‌లోనూ 19-17తో ఉన్న ఆమెనే మ్యాచ్ గెలిచేలా కనిపించింది. కానీ అక్కడి నుంచి ఆమె ఆట గాడి తప్పింది. వరుసగా రెండు పాయింట్లు గెలుచుకుని స్కోరు సమం చేసిన నిచానోన్ పోరాడి 26- 24తో నెగ్గింది. నిర్ణయాత్మక గేమ్‌లోనూ సింధు కోలుకోలేకపోయింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ శ్రీకాంత్, కశ్యప్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. ప్రి క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-9, 21-12తో జస్కందర్ జైనుద్దీన్ (మలేసియా)పై విజయం సాధించగా, డిఫెండింగ్ ఛాంపియన్ పారుపల్లి కశ్యప్ 21-19, 21-10తో జు సియున్ (చైనా)ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాలా, అశ్విని జోడీ 21-9, 21-10తో హాజారిక, హారిక జంటను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది.

## ఒలింపిక్స్‌లో చెనాయ్‌కు స్థానం



**ఢిల్లీ :** హైదరాబాదీ షూటన్ కైనన్ చెనాయ్ రియో ఒలింపిక్స్‌లో స్థానం సంపాదించాడు. ఆసియా ఒలింపిక్ అర్హత టోర్నీ సందర్భంగా అతడు ఈ ఘనత సాధించాడు. అయితే లండన్ ఒలింపిక్స్ రజత పతక విజేత విజయ్ కుమార్‌కు మాత్రం నిరాశ తప్పలేదు. గురువారం డబుల్ ట్రాప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా కైనన్ అందుబాటులో ఉన్న నాలుగు ఒలింపిక్ కోటా స్థానాల్లో ఒక స్థానాన్ని గెలిచాడు. 25 మీటర్ల ఫైర్‌పిస్టల్ ఈవెంట్లో ఐదో స్థానంలో నిలవడంతో విజయ్‌కుమా ర్‌కు కోటా స్థానం దక్క లేదు.

### ఆస్ట్రేలియన్‌ఓపెన్‌ఫైనల్స్ విజేత కెర్బర్

మెల్‌బోర్న్ : డిఫెండింగ్ చాంపియన్, వరల్డ్ నంబర్ వన్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ ఆస్ట్రేలియా ఓపెన్ సింగిల్స్ ఫైనల్లో అనూహ్యం ఓటమి పాలైంది. శనివారం జరిగిన ఫైనల్లో సెరెనా 4-6, 6-3, 4-6 తేడాతో ఏడో సీడ్ క్రీడాకారిణి కెర్బర్(జర్మనీ) చేతిలో ఓటమి పాలైంది.

# ఘనంగా ఎస్‌డీఏస్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు





దేశ విదేశాల్లో డాక్టర్లుగా స్థిరపడ్డ 1989 బ్యాచ్ వారి ఫోటోలను ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న దృశ్యం



ప్రారంభ ప్రార్థనా నృత్యం

క్రమశిక్షణకు నైతికవిలువలకు పేరుగాంచిన మిషనరీ విద్యాసంస్థల్లో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకొని, గత 50 ఏళ్లుగా విజయవాడ నడిబొడ్డున విద్యాపరిమళాలను విరజిమ్ముతున్న సంస్థ సెవెంత్‌డే ఎడ్వంటిస్ హైస్కూల్. ఆ సంస్థ గోల్డెన్ జూబ్లీ స్థానిక స్వర్ణవేదిక హాలులో గురవారం రంగరంగ వైభవంగా జరిగింది. దేశ విదేశాల నుంచి పూర్వపు విద్యార్థులు ఈ వేడుకకు విచ్చేసి వారి అనుభవాలను పంచుకున్నారు.



ఎస్‌డీఏ స్కూల్ ప్రిన్సిపాల్ ఉందర్మి రాజన్‌బాబు



హెడ్‌మాస్టర్ తుమ్మలాపల్లి సత్యదేవం



కోశాధికారి కడలి చంద్రశేఖరం

కార్యక్రమంలో ఎస్‌డిఏ స్కూల్ ప్రిన్సిపాల్ రాజన్‌బాబు ప్రారంభోపన్యాసం చేస్తూ, మిసెస్. బాలంటిన్ విజయవాడలో పాఠశాల ఆవశ్యకతను గుర్తించి 1965లో ఈ స్కూలు స్థాపించారని, అందుకోసం అనేక సవాళ్లను ఎదుర్కొన్నారని వివరిస్తూ ఆమె పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఆతరువాత దీనిని మరింత ముందుకు తీసుకెళ్లిన దివంగత బెంటీబాయ్ సేవలను ఆయన చాటిచెప్పారు. భారత్,నేపాల్, మాల్‌దీవుల ఎస్‌డీఏ సంఘాల అధ్యక్ష గురువులు ఎజ్రాస్ లక్రా మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయంగా మంచి వృత్తివిద్యా నిపుణులను అందించిన ఘనత తమ పాఠశాలదన్నారు. భారత మధ్య తూర్పు అధ్యక్షులు సిహెచ్. జాన్ విక్టర్ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులంతా ప్లస్ ఒన్, టూ తరగతి నిర్మాణానికి తమ వంతు సాయం అందించాలని కోరారు. పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రగతి పథంలో పయని స్తున్నప్పటికీ 1989 బ్యాచ్ మాత్రం అందరికంటే స్పెషల్ అని వారంతా డాక్టర్లయ్యారని పాఠశాల హెడ్‌మాస్టర్ తుమ్మలాపల్లి సత్యవేదం తెలిపారు. వారిలో డాక్టర్. రమేష్ సింగ్ హైదరాబాద్‌లో డాక్టర్‌గా స్థిరపడి ఐక్యరాజ్య సమితిలో కూడా తన సేవలను అందిస్తూ ప్రపంచస్థాయిలో 5వ, ర్యాంకులో ఉన్నారని ఆయన సగర్వంగా తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఉత్సాహపరిచాయి. ప్రదర్శకులతో పాటు వీక్షకులు కూడా స్టెప్పులేసి ఆనందాన్ని రెట్టింపు చేశారు. చివరిలో పదవ తరగతి విద్యార్థులు మా తుజే ..సలాం...నృత్యం అందరినీ అలరించింది. కార్యక్రమం ఆద్యంతాన్ని తన భుజస్తంధాలపై వేసుకొని విజయ వంతంగా నడిపిన 1986 బ్యాచ్‌కు విద్యార్థిని చాందినీ సింగ్‌ను సన్మానించారు. విద్యాలయంలో ప్లస్‌వన్,టూ ఏర్పాటుకు సహకరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ పాఠశాలలో తమ సేవలు అందించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతరులకు అందరికీ సన్మానం చేశారు. మా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ప్రాధాన్యత నిస్తామని ఎందుకంటే అమ్మప్రేమతో విద్యనేర్పగలవారు వారే అని ప్రిన్సిపాల్ రాజన్‌బాబు వారిని కొడియాడి వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి కోశాధికారి కడలి చంద్రశేకరమ్ వందన సమర్పణ చేశారు.



సెవెంత్‌డే ఎడ్వంటిస్ హైస్కూల్









## విశాఖ అంతర్జాతీయ ఫ్లీట్‌లో రాష్ట్రపతి, ప్రధాని

**విశాఖపట్టణం :** వచ్చేనెల ఫిబ్రవరి 4 నుంచి విశాఖపట్టణంలో జరగనున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో పాల్గనేందుకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి పర్యటన శుక్రవారం అధికారికంగా ఖరారైంది. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జి ఫిబ్రవరి5న రాత్రి 9 గంటల 10 నిముషాలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. విమానాశ్రయంలోనే ఉన్న ఐఎన్‌ఎస్ డేగాలో రాత్రికి బస చేస్తారు. ఆరవతేది ఉదయం 9 గంటల నుంచి 11.45 వరకు ఐఎఫ్‌ఆర్‌ను యుద్ధ నౌక నుంచి సమీక్షిస్తారు. సాయంత్రం 5.20 గంటలకు ఇండియన్ నేవి బ్యాంకు కన్సర్ట్ అనంతరం ఐఎఫ్‌ఆర్ శిల్పాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సాముద్రిక నావెల్ ఆడిటోరియంలో పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తారు. రాత్రి 7.40 నుంచి 9.00 గంటల వరకు తూర్పు నావికాదళ ఆఫీసర్ల మెస్‌లో అతిధులకు ఇచ్చే రెసిడెన్షియల్ విందులో పాల్గంటారు. 7వ తేదీ ఉదయం 11 గంటలకుఐఎన్‌ఎస్ డేగాకు చేరుకుని 11.20 గంటలకు ఢిల్లీకి పయనమవుతారు. ప్రధాని పర్యటన ఇలా

ప్రధాని నరేంద్ర మోడి ఫిబ్రవరి5న రాత్రి 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10.35కు నావి అతిధి గృహానికి వెళ్ళి రాత్రి అక్కడ బస చేస్తారు. 6వ తేదీ ఉదయం 8.15 గంటలకు నావి అతిధి గృహం నుంచి బయలుదేరి 8.30 గంటలకు ఐఎఫ్‌ఆర్ వేదిక వద్దకు వెళ్తారు. 11.45 గంటల వరకు జరిగే ఫ్లీట్ రివ్యూలో పాల్గంటారు. అనంతరం రాత్రి 9.25 గంటలకు విమానంలో భువనేశ్వర్ వెళ్తారు. 7వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తిరిగి విశాఖ విమానాశ్రయానికి వస్తారు. 4.55 గంటలకు ఐఎఫ్‌ఆర్ వేదిక వద్దకు చేరుకుంటారు. 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే సిటి పేరెడ్‌లో పాల్గంటారు. అనంతరం ప్రధాన మంత్రి గౌరవార్థం అతిధులకువిందును ఇస్తారు. రాత్రి 9.25 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్తారు.

# దేశ అంతర్గత భద్రతలో కోస్టుగార్డు సేవలు

## ( ఫిబ్రవరి1న కోస్టు గార్డు దినోత్సవం సందర్భంగా )



**భారతీయ అంతర్గత భద్రతలో కోస్టుగార్డు ఎంతగానో కృషిచేస్తుంది. భారత జల రక్షణకు, దేశభద్రతకు కేంద్ర ప్రభుత్వం 1977, ఫిబ్రవరి 1 నుంచి దేశానికి ఉన్న అతి పెద్దసముద్ర తీర ప్రాంత రక్షణ కోసం కోస్టు గార్డును ఏర్పాటు చేసింది. భారత నౌకాదళం కోస్టుగార్డుల ఆవిర్భావానికి ఎంతోకృషి చేసింది. దీంతో విదేశీ వస్తువుల అక్రమ రవాణాను కూడా అరికట్టగలిగింది.**

మొదట ఈ సంస్థను హోం శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించాలని భావించినా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించి రక్షణ రంగ ఆధ్వర్యంలో కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ప్రారంభం అయినప్పుడు కేవలం రెండు కార్వెట్స్, ఐదు పెట్రోల్ పడవలను నౌకాదళం నుంచి కోస్టుగార్డులకు సమకూర్చారు. అయితే ప్రస్తుతం అనేక నూతన ఆధునిక ఆయుధ సంపత్తిని భారత కోస్టుగార్డు కైవసం చేసుకొని శత్రుదేశాలకు హడల్ పుట్టిస్తుంది. ఇండియన్ నౌకాదళాని కి చెందిన వైస్ అడ్మిరల్ వీఏ కామత్‌ను కోస్టుగార్డు డైరెక్టర్ జనరల్‌గా అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నియమించారు. అక్టోబర్ 1999లో పనామాలో నమోదు చేసిన జపనీస్ కార్గో నౌక ఎంవీ అలోంద్ర రైన్‌బో ఇండోనేషియా హైజాక్ చేసింది. దాని సిబ్బందిని థాయిలాండ్ రక్షించగా, నౌక పేరును ఎంవీ మెగారామగా మార్చి కొచ్చి నుంచి పాక్‌కు ప్రయాణిస్తుం డగా భారత నౌకా దళం,కోస్టుగార్డు దానిని చుట్టుముట్టి దానిలోని సిబ్బందిని అరెస్టు చేశారు. లంక నుంచి వచ్చిన బ్లాక్ బ్యూటీని భారత్ తూర్పు నావికాదళం చుట్టు ముట్టింది. ఇలాంటి ఘనివిజయాల ను ఎన్నో కోస్టు గార్డు స్వంతం చేసుకుంది. భారత కోస్టు గార్డులు ఇతర దేశాల నావికాదళంతోపాటు అనేక విన్యాసాల్లో పాల్గొన్నారు. 2005లోపాక్ సముద్ర జలాల రక్షణ దళాలతోకలిసి మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పీఎంఎస్ఏ) ను భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశ కోస్టుగార్డులు జపాన్, కొరియా లతో కలసి 2006లో సాహస





విన్యాసాలను నిర్వహించారు. 2008లో ముంబై దాడుల అనం తరం భారత ప్రభుత్వం ఇండియన్ కోస్టుగార్డు పరిధిని మరింత విస్తృత పరచింది. దీనిలో భాగంగా 2020 నాటికి 150 అధునాతన నౌకలు, రెండు ఇంజన్లు కలిగిన 100 ఎయిర్ క్రాఫ్టులను సమకూర్చుకునే దిశలో అడుగులు వేస్తుంది.

పశ్చిమ ప్రాంత కోస్టుగార్డుకు ముంబై కేంద్రంగా కమాండర్ సురేంద్రపాల్ సింగ్ ఆధ్వర్యంలో ఈ శాఖ పనిచేస్తోంది. తూర్పు ప్రాంత సముద్రతీరానికి చెన్నై కేంద్రంగా కమాండర్ సత్యప్రకాష్, ఈశాన్య ముఖ్యపట్టణంగా కోల్‌కత దీని కమాండర్ విఎస్‌ఆర్ మూర్తి, అండమాన్, నికోబార్ ముఖ్యపట ్టణంగా పోర్టుబ్లెయిర్ ఉండగా కమాండర్ ఎన్‌నటరాజన్, ఆగ్నేయ ప్రాంతానికి గాంధీనగర్ కేంద్రంగా ఉండగా కమాండర్ కులదీప్ సింగ్ షారోన్ ఆధ్వర్యంలో దేశంలోని మూడు వైపులా ప్రతినిత్యం పహారా కాస్తూ దేశఅంర్గత భద్రతను పరిరక్షిస్తున్నారు.






# విజ్ఞాన విపంచి

## ఇంగ్లీష్ నేర్చుకుందాం...

ఇంగ్లీషంటే భయపడనవసరం లేదని, దాన్ని సులువుగా నేర్చుకోవచ్చంటూ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ సంస్థ అధ్యాపకులు పూలబాల వెంకట్ సంభాషణ రూపంలో వివరించారు.





Complaisant = polite, Professional = like a professional
Affable = pleasant Tenacious = stubborn

Poolabala, ELT Expert and Resource person
Director: Eazy Foreign Languages,
Vijayawada: Ph- 9700877 409
French, German, Spanish, Italian and Japanese

## గ్రామ కంఠాలపై రైతు ప్రతినిధులతో నారాయణ సమావేశం



**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** రాజధాని ప్రాంతంలో గ్రామ కంఠాలు, రోడ్ల నిర్మాణం, కేపిటల్‌సిటీ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తదితర అంశాలకు సంబంధించి రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు రైతు ప్రతినిధులతో రెండు రోజుల క్రితం సమావేశం నిర్వహించారు. విజయవాడలోని సీఆర్‌డిఏ ప్రధాన కార్యాల యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోరైతు ప్రతినిధు లు పలు అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్ళారు. అత్యధికంగా సమస్యలున్న రాజధాని ప్రాంత గ్రామాల రైతు ప్రతినిధులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ముఖ్యంగా రాజధాని ప్రాంత ప్రజలు, రైతులు ఏఏ విషయాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారనే అంశాలపై మంత్రులు రైతు ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధిగమించి భవిష్యత్‌లోఎలా ముందుకు వెళ్ళాలి అనే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీకాంత్, గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే, జేసీ చెరుకూరి శ్రీధర్, సిఆర్‌డిఏ అదనపు కమిషన్లు డాక్టర్ ఎ. మల్లికార్జున, వి.రామ మనోహర రావు, ప్రసన్న వెంకటేశ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అదనపు ఆదాయం
మీకు తీరుస్తుంది ఎన్నో అవసరాలు!
మీరు ఏ రంగానికి చెందిన వారైనా సరే!
ఉద్యోగులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు, వ్యవసాయ దారులు,
గృహిణలు మీరు ఏ పనిలో ఉన్నా
పూర్తి కాలం (ఫుల్‌టైం) లేదా పరిమిత కాలం(పార్ట్ టైం)
మీ అవకాశాన్ని బట్టి, మీ నోటి మాటే పెట్టుబడిగా
ఆదాయం సమకూర్చుకునే అద్భుత అవకాశం మీ కోసం ఎదురు చూస్తున్నది
వెంటనే సంప్రదించండి
9440662699, 9676844442

బిల్డర్స్‌కు ఆహ్వానం
విజయవాడ నుంచి కంచికచర్ల వెళ్ళే మార్గంలో 36 ఎకరాల స్థలం జాయింట్ డవలప్‌మెంట్ లేదా అమ్మకానికి, అల్ట్రా మోడల్‌టౌన్‌షిప్ (ఇండివిద్యువల్, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ఫంక్షన్ హాల్స్) కట్టుకోవడానికి అనువుగా హైవే పక్కనే కలదు.
వివరాలకు నెం. 9676844442(రవి), 7680994755, 9440662699 సంప్రదించగలరు

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor-in-Chief: Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, APTEL 14598 / 2015.